ANN తెలుగు

Follow: @ANNTELUGU

25-10-2026

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 258 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## ఓటముల నుంచి అధికార శిఖరాలకు..

- జెడ్పీటీసీ నుంచి ముఖ్యమంత్రి వరకు.
- కొడంగల్ నుంచి తెలంగాణ పాలనా పగ్గాల వరకు
- రాజకీయ వివాదాలు విజయాలతో సాగిన ప్రస్థానం
- రెండు దశాబ్దాల్లో తెలంగాణ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చిన రేవంత్

04

**టాప్ న్యూస్**

### వచ్చే ఎన్నికల్లో పోటీచేయాలనుకుంటే.. పదవులు వదిలేసి నియోజకవర్గం వెళ్ళండి

- తెలంగాణ అంటే హైదరాబాద్ ఒక్కటే కాదు
- స్టేట్ ఆఫీసు లో తిరిగితే సరిపోదు.. గ్రౌండ్ ముఖ్యం
- తెలంగాణ బీజేపీ నేతలకు సునీల్ బన్సల్ స్ట్రాంగ్ వార్నింగ్



02

### ముంబైకు సీఎం రేవంత్ రెడ్డి ప్రాణహితపై సీఎం ఫడ్నవిస్ తో చర్చలు

రేపు కీలక సమావేశం



02

### కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో సీఎం చంద్రబాబు భేటీ



02



# దీపావళి ధమాకా

## సగం ఛైర్మన్లు పాతవారికే

- ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్ చర్చల్లో ఛైర్మన్ల అంశం కొలిక్కి
- త్వరలో 50మందికి పైగా నామినేటెడ్ పోస్టులు
- ముఖ్యనేతలందరికీ రెన్యువల్
- ఇరావత్రి అనిల్, పటేల్ రమేష్ రెడ్డి, నూతి శ్రీకాంత్ గౌడ్ , మెట్టు సాయి సహా అనేకమందికి మరో ఛాన్స్

**హైదరాబాద్, మహా :** కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల పందారానికి రంగం సిద్ధమైంది. ఎంతోకాలంగా ఊరిస్తున్న పదవులు దీపావళి ధమాకా గా రాబోతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తాజాగా పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ భేటీ కాగా, నామినేటెడ్ పదవులపై ఇప్పటికే పూర్తయిన కసరత్తు దాదాపు పూర్తయినట్లు తెలుస్తోంది. నవంబర్ 1న ఇండియా కూటమి ర్యాలీ కోసం నేతలంతా ఢిల్లీ వెళ్ళనుండగా, హూకమాండ్ ఆమోదంతో నవబంర్ 3 లేదా 4 తేదీల్లో జాబితా వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జూలైలో 37 కీలక కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమించగా, వాటి గవువు ఈఏడాది జూలైతో పూర్తయింది. మరికొన్ని పదవులు కూడా భర్తీచేయాల్సి ఉంది. ఈఏడాది డిసెంబర్ తో ప్రభుత్వం ఏర్పడి మూడేళ్ళు పూర్తవుతున్న నేపథ్యంలో కొత్త ఉత్సాహంతో పార్టీని ముందుకు తీసుకెళ్ళాలని సీఎం భావిస్తున్నారు, అందుకే వచ్చే ఎన్నికల కోణంలో

మిగతా 2వ పేజీలో



పూర్తయి ఆక్యుపెన్సీ పొందిన భవనాలు

# వీవీకే స్క్వేర్, శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్స్ మాయాజాలం..!

### ఓల్డ్ సఫిల్‌గూడలో రెసిడెన్సియల్ అపార్ట్‌మెంట్లలో కమర్షియల్ దందా..!

### ఓసీ పొందిన తర్వాత యథేచ్ఛగా 11 అక్రమ షట్టర్ల నిర్మాణం..!

- అక్రమ షట్టర్లకు టౌన్ ప్లానింగ్ అధికారుల అండదండలు..?
- భారీగా ముడుపులు ముట్టడంతోనే అటువైపు కన్నెత్తి చూడని వైనం..?
- ప్రారంభానికి సిద్ధమైన షట్టర్లు...!
- గడప దాటని జోనల్ కమీషనర్ సంచిత్ గంగ్వార్...!
- అధికారుల తీరుపై మండిపడుతున్న స్థానికులు ..!
- ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ రద్దు చేయాలని పురప్రముఖుల డిమాండ్...!

02

నివాస సముదాయాల కోసం అనుమతులు పొంది.. తీరా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసి) చేతికి అందగానే కొంతమంది బిల్డర్లు తమ వక్రబుద్ధిని ప్రదర్శించి కమర్షియల్ కాంప్లెక్స్‌లుగా మార్చేస్తున్నారు.. ఓల్డ్ సఫిల్‌గూడ ప్రధాన రహదారి పక్కనే వెలిసిన 'వీవీకే స్క్వేర్' అపార్ట్‌మెంట్ వేదికగా 'శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్స్' నిబంధనలను తుంగలో తొక్కి అక్రమ నిర్మాణాల మాయాజాలానికి తెగబడింది. నివాస ప్రాంతాన్ని ధర్జాగా వాణిజ్య సముదాయంగా మార్చేస్తూ, వరుసగా 11 కమర్షియల్ షెటర్లను అక్రమంగా నిర్మించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.. స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే ఈ తతంగమంతా సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.. బిల్డర్ల నుండి భారీగా ముడుపులు ముట్టడంతోనే అధికారులు కేవలం నోటీసులిచ్చి చేతులు దులుపుకున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు మండిపడుతున్నారు.. ప్రస్తుతం ఈ అక్రమ షట్టర్లు ప్రారంభానికి సిద్ధమవడంతో అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..ఇంత జరుగుతున్నా జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ కనీసం క్షేత్రస్థాయిలో పరిశీలించకపోవడంతో పాటు , గడప దాటి బయటకు రాకపోవడం వెనుక ఆంతర్యమేంటని వారు ప్రశ్నిస్తున్నారు..ఇకనైనా అక్రమాలకు తావులేకుండా ఎంఎంసీ కమిషనర్ స్వయంగా రంగంలోకి దిగాలని, నిబంధనలు ఉల్లంఘించిన సదరు భవనాల ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ను వెంటనే రద్దు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పురప్రముఖులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు..

## ప్రభుత్వ పనితీరుపైనే ప్రజల తీర్పు

- స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు 59 పిటిషన్లు.
- ఉమ్మడి రాష్ట్రంలో నక్సలిజం, ఫ్యాక్షనిజాన్ని అణచివేశా.
- ఏపీలో శాంతిభద్రతలు భేష్.
- రాయచోటి, దర్శి అల్లర్లులోపంజాబ్ క్రిమినల్స్.
- వైసీపీ అరాచకాలపై సీఎం చంద్రబాబు నిప్పులు.

అమరావతి, మహా : ప్రభుత్వ పనితీరు ఏ విధంగా ఉందనే దానిపైనే ఎప్పుడూ ప్రజల తీర్పు ఆధారపడి ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాలు, గత ప్రభుత్వ అరాచకాలు,

మిగతా 3వ పేజీలో

## టౌన్ ప్లానింగ్ అధికారులా మజాకా....!

### రెండు నోటీసులిచ్చాం.. కూలుస్తాం...!

- తూంకుంటలో అక్రమ షెడ్డుపై టి పి ఎస్ మేఘన బుకాయింపు...!
- నోటీసులకే పరిమితమైన చర్యలు.. శరవేగంగా కొనసాగుతున్న అక్రమ షెడ్డు నిర్మాణ పనులు..!
- ప్రారంభానికి సిద్ధమవుతున్న షెడ్డు.. చోద్యం చూస్తున్న అధికారు యంత్రాంగం..!
- గాడి తప్పిన ఎంఎంసీ పాలన...!
- ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి స్పందించేదెప్పుడు..?

02








## తెలుగోళ్ళ సత్తా

- పిచ్ పై తెలుగులో మాట్లాడుకున్న తిలక్ వర్మ, నితీశ్ రెడ్డి
- న్యూజిలాండ్‌పై భారత్ విజయం
.. కీలక పాత్ర పోషించిన తెలుగు క్రికెటర్లు
- వీడియో పంచుకున్న నారా లోకేశ్

02






## వీవీకే స్క్వేర్, శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్స్

# మాయాజాలం..!

**మహా, సిటీ బ్యూరో:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజిగిరి జోన్, మౌలాలి సర్కిల్, ఓల్డ్ సఫిల్‌గూడ ప్రధాన రహదారి పక్కన, డీ మార్ట్ సమీపంలోని 'వీవీకే స్క్వేర్', 'శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్స్' పేర్లతో కొనసాగుతున్న అక్రమ కమర్షియల్ షట్టర్ల వ్యవహారం రోజురోజుకూ చర్చనీయాంశంగా మారుతోంది. నివాస సముదాయాల పేరుతో అనుమతులు పొంది, నిర్మాణాలు పూర్తయ్యాక ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) తీసుకున్న అనంతరం అపార్ట్‌మెంట్ ముందు భాగంలో వరుసగా 11 కమర్షియల్ షట్టర్లు నిర్మిస్తుండటంతో స్థానికుల్లో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై వరుసగా ఫిర్యాదులు, వార్తా కథనాలు వెలువడుతున్నా, సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు కేవలం నోటీసులిచ్చి చేతులు దులుపుకున్నారే తప్ప క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి అక్రమ షట్టర్ల నిర్మాణ పనులను అడ్డుకోవడంలో విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


ప్రారంభానికి సిద్ధమవుతున్న షట్టర్లు

**ఆక్యుపెన్సీ పొందగానే అసలు రంగు..!**
**కాసుల కక్కుర్తితో బరితెగింపు!**

సాధారణంగా ఏదైనా ఒక అపార్ట్‌మెంట్ నిర్మాణం పూర్తయిన తర్వాత, అది నిబంధనల ప్రకారమే నిర్మించారని ధృవీకరిస్తూ మున్సిపల్ అధికారులు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసి) జారీ చేస్తారు. ఆ సర్టిఫికెట్ వచ్చిన తర్వాత భవన నిర్మాణంలో ఎలాంటి మార్పులు చేయకూడదనేది చట్టం. కానీ ఇక్కడ శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యానికి మాత్రం చట్టాలన్నా, నిబంధనలన్నా లెక్కేలేకుండా పోయిందని స్థానికులు మండి పడుతున్నారు. అపార్ట్‌మెంట్ల నిర్మాణం కోసం కేవలం రెసిడెన్షియల్ అనుమతులు పొందిన సదరు బిల్డర్లకు, ఓసీ చేతికి రాగానే వక్రబుద్ధి పుట్టిందని, అపార్ట్‌మెంట్‌లో నివాసముండే వారి ప్రయోజనాలను, హక్కులను పూర్తిగా తుంగలో తొక్కుతూ.. కేవలం కాసుల కక్కుర్తితో ఏకంగా 11 అక్రమ కమర్షియల్ షట్టర్లను నిర్మిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. నివాస ప్రాంతాన్ని ధర్జాగా వాణిజ్య సముదాయంగా మార్చేసి కమర్షియల్ దందాకు రన్‌వే సిద్ధం చేశారని వారు ఆరోపిస్తున్నారు.

**టౌన్ ప్లానింగ్ అధికారుల**
**కనుసన్నల్లోనే.. నోటీసుల డ్రామా..!**

ఈ భారీ అక్రమ దందా స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తమ కళ్లెదుటే ఇంత పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం వెనుక పెద్ద 'కథే' నడిచిందని బాహాటంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. బిల్డర్ల నుండి భారీగా ముడుపులు ముట్టడం వల్లే అధికారులు కేవలం నోటీసులిచ్చి చేతులు దులుపుకున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో నిర్మాణాలను కూల్చివేయడానికి ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు. అధికారుల ఇచ్చిన నోటీసులను కూడా బిల్డర్ బేఖాతరు చేస్తూ పనులను చకచకా పూర్తి చేసేశారని వారు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ అక్రమ షట్టర్లు ప్రారంభానికి కూడా సిద్ధమవడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**భవిష్యత్తులో 'ట్రాఫిక్ గండం'..**
**రోడ్డు భద్రత శూన్యం!**

ఓల్డ్ సఫిల్‌గూడ ప్రధాన రహదారి ఎప్పుడూ వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. అలాంటి ముఖ్యమైన రహదారి పక్కనే ఉన్న ఈ అపార్ట్‌మెంట్‌లో సాగుతున్న కమర్షియల్ వ్యాపారాల వల్ల భవిష్యత్తులో రోడ్డు భద్రత పూర్తిగా కొరవడుతుందని స్థానికులు భయపడుతున్నారు. కస్టమర్ల వాహనాల పార్కింగ్ వల్ల రహదారిపై ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతుందని, నివాస ప్రాంతాల్లో ప్రశాంతత దెబ్బతింటుందని లబోదిబోమంటున్నారు. బిల్డర్ల స్వార్థం కోసం తాము నిత్యం నరకం చూడాలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**గడప దాటని జోనల్ కమిషనర్.. ..!**

నివాస సముదాయాల్లో అక్రమ షట్టర్ల నిర్మాణంపై, స్థానికులు నెత్తీనోరూ బాదుకుంటున్నా, అనేక ఫిర్యాదులు, వార్తలు వెలువడుతున్నా, మల్కాజ్గిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ కనీసం క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలించకపోవడం, గడప దాటి బయటకు రాకపోవడం వెనుక ఆంతర్యమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి, బిల్డర్లకు కొమ్ముకాసే ధోరణిపై స్థానికంగా తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.


బిల్డర్ల బరితెగింపు..!

**ఇకనైనా కమిషనర్, జోనల్ కమిషనర్**
**స్పందించాలంటున్న స్థానికులు !**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ఈ వ్యవహారంపై తక్షణమే స్పందించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. మౌలాలి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, ఆమోదిత భవన ప్రణాళికతో ప్రస్తుత నిర్మాణాలను పోల్చి చూడాలని కోరుతున్నారు. ఉల్లంఘనలు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం నిర్మాణ పనులను నిలిపివేయడంతో పాటు, అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ఇకనైనా అక్రమాలకు తావులేకుండా ఎంఎంసీ కమిషనర్ స్వయంగా రంగంలోకి దిగాలని, నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా షట్టర్లు నిర్మించిన సదరు భవనం ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ను వెంటనే రద్దు చేయాలని, ఆ షట్టర్లను వెంటనే కూల్చివేసి బిల్డర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పురప్రముఖులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


వీవీకే స్క్వేర్, శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్స్ అరాచకం...!
బిల్డర్ల బరితెగింపు..!
రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్లలో కమర్షియల్ దందా..!
వరుసగా 11 అక్రమ షెటర్ల నిర్మాణం...!

# టౌన్ ప్లానింగ్ అధికారులా మజాకా...!


యథేచ్ఛగా కొనసాగుతున్న అక్రమ షెడ్డు నిర్మాణం

**శామీర్‌పేట, అక్టోబర్ 25 (మహా):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, శామీర్‌పేట మండలం, కీసర సర్కిల్ పరిధిలోని తూంకుంట డివిజన్‌లో నిబంధనలకు విరుద్ధంగా, ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఓ భారీ అక్రమ షెడ్డు వ్యవహారంలో అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి . "నోటీసులిచ్చాం.. చర్యలు తీసుకుంటాం" అని అధికారులు పేర్కొంటున్న మాటలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి తప్ప, అక్రమ షెడ్డు నిర్మాణ పనులను నిలిపివేసిన దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు కేవలం నామమాత్రపు నోటీసుల నాటకమాడుతున్నారు తప్ప క్షేత్రస్థాయిలో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**డీ-మార్ట్ పేరుతో ప్రచారం..**
**జీరో పర్మిషన్‌తో నిర్మాణం!**

హైదరాబాద్-కరీంనగర్ రాజీవ్ రహదారికి ఆనుకుని, అంబేద్కర్ విగ్రహం పక్కనే సుమారు ఎకరం విస్తీర్ణంలో ఈ భారీ షెడ్డు నిర్మాణం జరుగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇక్కడ ఒక పెద్ద రిటైల్ సంస్థ (డీమార్ట్ లేదా ఇతర వాణిజ్య సంస్థ) రాబోతోందని స్థానికంగా జోరుగా ప్రచారం సాగుతోంది. ఇంత పెద్ద ఎత్తున వాణిజ్య కార్యకలాపాల కోసం నిర్మిస్తున్న ఈ నిర్మాణానికి ప్లాన్ అప్రూవల్ గానీ, ల్యాండ్ యూజ్ (భూ వినియోగం) మార్పిడి అనుమతులు గానీ ఏవీ లేవని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిగా 'జీరో పర్మిషన్'తో లక్షలాది రూపాయల విలువైన ఈ నిర్మాణం యథేచ్ఛగా సాగిపోతుండటం వెనుక టౌన్ ప్లానింగ్ అధికారుల హస్తం ఉందనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

**ముడుపుల మత్తులో టౌన్ ప్లానింగ్**
**యంత్రాంగం...?**

సాధారణంగా సామాన్యులు చిన్నపాటి ఇల్లు కట్టుకుంటేనే అనుమతుల పేరుతో హడావుడి చేస్తూ చుట్టూ తిరిగే టౌన్ ప్లానింగ్ అధికారులు.. కళ్లెదుటే ఎకరం స్థలంలో ఇంత పెద్ద భారీ వాణిజ్య నిర్మాణం జరుగుతున్నా అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక అసలు రహస్యం ఏమిటని స్థానికులు మండిపడుతున్నారు. నిర్మాణదారుల నుంచి భారీగా ముడుపులు ముట్టడం వల్లే అధికారులు కేవలం నామమాత్రపు నోటీసులిచ్చి కాలం వెళ్లదీస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్య ధోరణి కారణంగా ప్రభుత్వానికి ల్యాండ్ కన్వర్షన్, బిల్డింగ్ పర్మిషన్స్ రూపంలో రావాల్సిన లక్షలాది రూపాయల ఆదాయానికి గండి పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రెండు నోటీసులిచ్చాం.. కూలుస్తాం..**
**ఇదేనా చర్యలు..!**

ఈ అక్రమ షెడ్డు నిర్మాణంపై చర్యల గురించి సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారి (టీపీఎస్) మేఘనను వివరణ కోరగా, ఇప్పటికే రెండు నోటీసులు జారీ చేసినట్లు స్పష్టం చేశారని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే నోటీసులు జారీ చేసిన తర్వాత కూడా నిర్మాణ పనులు కొనసాగుతుండటంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నోటీసులు జారీ చేసినట్లు చెప్పడమే తప్ప, నిర్మాణ పనులు నిలిపివేసేందుకు తీసుకున్న చర్యలేమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

అక్రమ నిర్మాణాల నియంత్రణలో టౌన్ ప్లానింగ్ విభాగం బాధ్యత కీలకం. నిర్మాణానికి అవసరమైన అనుమతులను పరిశీలించడం, ఉల్లంఘనలు గుర్తిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవడం, అవసరమైనప్పుడు పనులు నిలిపివేయించడం అధికారుల విధుల్లో భాగం. అయితే తూంకుంట భారీ షెడ్డు వ్యవహారంలో నోటీసుల జారీ గురించి చెబుతున్నప్పటికీ, నిర్మాణం ఎందుకు కొనసాగుతోందన్న ప్రశ్నకు స్పష్టత రావడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. రెండు నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా పనులు ఆగకపోతే తదుపరి చర్యలు ఏమిటి? కూల్చివేత ఎప్పుడు చేపడతారు? అన్న అంశాలపై అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని వారు కోరుతున్నారు.


అక్రమ షెడ్డును కూల్చేదెన్నడు...!
అక్రమ షెడ్డు..!

**గాడి తప్పిన ఎంఎంసీ పాలన..!**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాల నియంత్రణ, పట్టణ ప్రణాళిక నిబంధనల అమలుపై అధికారుల పర్యవేక్షణ ఎంతవరకు ఉందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫిర్యాదులు, నోటీసులు, కూల్చివేత హామీలు ఉన్నప్పటికీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఎంఎంసీ పాలన తీరుపై విమర్శలకు కారణమవుతున్నాయి. నోటీసులు జారీ చేసిన అధికారులు వాటి అమలును పర్యవేక్షిస్తున్నారా? నిర్మాణదారులకు తదుపరి చర్యలపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారా? అన్న అంశాలపై ఉన్నతాధికారులు సమీక్ష జరపాలని స్థానికులు కోరుతున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే ప్రభుత్వానికి రావాల్సిన అనుమతి రుసుములు, అభివృద్ధి ఛార్జీలు, ఇతర పన్నుల విషయంలోనూ నిబంధనల ప్రకారం విచారణ జరపాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**ఎంఎంసీ కమిషనర్ స్పందించేదెప్పుడు..?**

తూంకుంటలో కొనసాగుతున్న ఈ భారీ అక్రమ షెడ్డు నిర్మాణంపై ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తక్షణమే స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. టీపీఎస్ మేఘన జారీ చేసిన రెండు నోటీసుల వివరాలను, నిర్మాణానికి సంబంధించిన అనుమతులను స్వయంగా పరిశీలించాలని వారు కోరుతున్నారు. అవసరమైతే స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ద్వారా క్షేత్రస్థాయి విచారణ జరిపించి, నిబంధనల ఉల్లంఘనలను నిర్ధారించి, తక్షణమే ఈ అక్రమ షెడ్డును కూల్చివేయడంతో పాటు, అక్రమ షెడ్డును పూర్తిగా సీజ్ చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. మరి ఈ భారీ అక్రమ షెడ్డు నిర్మాణంపై ఎంఎంసీ కమిషనర్ ఎప్పుడు చర్యలు తీసుకుంటారు? నోటీసులకే పరిమితమైన టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుకు ఎప్పుడు ముగింపు పలుకుతారు? అనేది వేచి చూడాల్సిందే.




తూంకుంట నడిబొడ్డున భారీ అక్రమ షెడ్డు..!
అక్రమ షెడ్డును కూల్చేదెన్నడు...!

# దీపావళి ధమాకా

( మొదటి పేజీ తరువాయి )

బలమైన టీమ్ ను నిర్మించే అవకాశం కనబడుతోంది.

**మళ్ళీ రెన్యువల్**

సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రత్యేకంగా భేటీ అయ్యి ప్రాథమికంగా కసరత్తు పూర్తిచేశారని తెలిసింది. గతంలో నామినేటెడ్ పదవుల్లో నియమించిన వారిలో కొందరు సమర్థంగా పనిచేసి పార్టీ బలోపేతానికి తోడ్పడగా, మరికొందరు నామమాత్రంగా మిగిలిపోయారని అధిష్ఠానం వద్దకు నివేదికలు చేరాయట. దీంతో కొత్తగా భర్తీ చేయబోయే పోస్టుల్లో పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేసిన వారికే తిరిగి అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్టు ప్రచారం జరుగుతున్నది. ఆశించిన స్థాయిలో ఫలితాలు చూపని వారి స్థానాల్లో కొత్త ముఖాలకు అవకాశం ఇవ్వాలని పార్టీ పెద్దలు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో గాంధీభవన్ నుంచి ఢిల్లీలోని ఏఐసీసీ పెద్దల వరకు పెద్ద ఎత్తున పైరవీలు, ప్రయత్నాలు సాగుతున్నాయి.

**కీలక నేతలకు పట్టం**

నామినేటెడ్ పోస్టులకు 2024 జూలై నాటి జీవోల ప్రకారం రెండేండ్ల కాలపరిమితితో పదవులు పొందారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆదినుండీ పనిచేస్తున్న పదిహేను నుండి 20మంది నేతలు జాబితాలో ఉండనున్నారు. ఎండిసి ఛైర్మన్ ఇరావత్రి అనిల్, రాష్ట్ర మౌలిక సదుపాయాల సంస్థ ఛైర్‌పర్సన్‌గా ఉన్న నిర్మలాజగ్గారెడ్డి, క్రీడాప్రాధికార సంస్థ ఛైర్మన్ శివసేనారెడ్డి, ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్, పర్యాటకాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి తదితరులను యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించినట్టు తెలిసింది. నూతి శ్రీకాంత్ గౌడ్, బెల్లయ్యనాయక్ తదితరులకు కూడా రెన్యువల్ ఖాయంగా కబడుతోంది.



**ఎవరి ప్రయత్నాలు వారివే**

రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితంగా ఉండే వారితో నేతలు ప్రయత్నిస్తున్నారు. ప్రధానంగా ఎంపీ వేం నరేందర్ రెడ్డిని పలువురు నేతలు కలిసి వినతులు అందిస్తున్నారు. పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్‌ను కూడా నేతలు ఒత్తిడికి గురిచేస్తున్నారు. పదవుల కోసం ప్రతీరోజూ అనేకమంది విన్నపాలు అందిస్తున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డికి కూడా ఈ తాకిడి అధికంగానే ఉంది. జిల్లాల్లో మంత్రులు ఎవరికి వారు తమ అనుచరులకు ప్రాధాన్యం దక్కేలా ప్రయత్నిస్తున్నారు. మొత్తంగా స్థానాల్లో బీసీల ప్రాధాన్యం బలంగా ఉండేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ ఫార్ములా రూపొందిస్తున్నారు. బీసీ కులగణతో సీఎం రేవంత్ రెడ్డి బీసీలకు న్యాయం అంశంలో ముందు వరుసలో ఉండగా, పదవుల భర్తీలోనూ అదే ఫార్ములాను అనుసరిస్తున్నారు. త్వరలో నామినేటెడ్ ఎమ్మెల్సీలలోనూ ఒకటి లేదా రెండు బీసీలకు దక్కే ఛాన్స్ ఉంది.

# వచ్చే ఎన్నికల్లో పోటీచేయాలనుకుంటే.. పదవులు వదిలేసి నియోజకవర్గం వెళ్ళండి

- తెలంగాణ అంటే హైదరాబాద్ ఒక్కటే కాదు
- స్టేట్ ఆఫీసు లో తిరిగితే సరిపోదు.. గ్రౌండ్ ముఖ్యం
- తెలంగాణ బీజేపీ నేతలకు సునీల్ బన్సల్ స్ట్రాంగ్ వార్నింగ్



**హైదరాబాద్, మహా :** చేతకాకపోతే పదవులు వదిలేసి తప్పుకోండి.. అంతేగానీ కేవలం హైదరాబాద్‌కే పరిమితమైతే మాత్రం ఊరుకునేది లేదు!" అంటూ తెలంగాణ బీజేపీ నాయకుల తీరుపై పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ సునీల్ బన్సల్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బహిరంగ సభల్లో పెద్ద పెద్ద ప్రసంగాలు చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, నేరుగా ప్రజల్లోకి వెళ్లి చిన్న చిన్న సమూహాలతో కలిసి కింద కూర్చుని చాయ్ తాగుతూ వారిలో మమేకం కావాలని ఆయన నేతలకు గట్టి హుకుం జారీ చేశారు. శనివారం నాంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన అత్యున్నత స్థాయి సమావేశంలో సునీల్ బన్సల్ సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. తెలంగాణ అంటే హైదరాబాద్ ఒక్కటే కాదని, కేవలం హైదరాబాద్ స్టేట్ ఆఫీసులో తిరిగితే సరిపోదన్నారు. క్షేత్రస్థాయి వరకు వెళ్లాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వాళ్లు పార్టీ పదవులకు రాజీనామా చేసి నియోజకవర్గాలకు వెళ్లి పనిచేసుకోవాలని సూటిగా చెప్పారు. తాను ఇక నుంచి తెలంగాణలోనే ఉంటానని, అన్నీ పరిశీలిస్తానని స్పష్టం చేశారు. సభలు, మైకులు వంటి అనవసరమైన ఆర్భాటాలు తగ్గించుకోవాలన్నారు. తెలంగాణ అంటే కేవలం హైదరాబాద్ ఒక్కటే కాదని, నాయకులు రాజధాని పరిధిలోని రాష్ట్ర కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయడం మాని వెంటనే గ్రౌండ్ లెవెల్‌లోకి వెళ్లాలని బన్సల్ గట్టిగా హెచ్చరించారు. ఆఫీసులకే పరిమితమై, కేవలం సమీక్షల పేరుతో కాలక్షేపం చేసే నేతల తీరు ఇకపై పార్టీలో చెల్లదని స్పష్టం చేశారు. బహిరంగ సభల్లో గొంతుచించుకుని పెద్ద పెద్ద ప్రసంగాలు చేయడం వల్ల ప్రజల్లో ఎలాంటి మైలేజ్ రాదని, అంతకంటే నేరుగా ప్రజల్లోకి వెళ్లి చిన్న చిన్న సమూహాలతో మమేకమై, నలుగురితో కలిసి కింద కూర్చుని చాయ్ తాగుతూ సమస్యలపై మాట్లాడితేనే అసలైన రాజకీయ ప్రభావం ఉంటుందని ఆయన హితవు పలికారు. పార్టీ అధిష్టానం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇచ్చిన కార్యక్రమాలను అమలు చేయడంలోనూ కొందరు నేతలు అలసత్వం ప్రదర్శిస్తున్నారని బన్సల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకమాండ్ నిర్దేశించిన కనీసం రెండు, మూడు కార్యక్రమాలను కూడా క్షేత్రస్థాయిలో పరిపూర్ణంగా అమలు చేయకపోతే ఎలా అని ఆయన సూటిగా నిలదీశారు. చేతకానితనాన్ని ఇకపై సహించేది లేదని, ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయి పోరాటాలే లక్ష్యంగా పనిచేయాలని ఆయన స్పష్టం చేయడంతో సమావేశంలో ఒక్కసారిగా ఉత్కంఠ వాతావరణం నెలకొంది.

# ముంబైకు సీఎం రేవంత్ రెడ్డి
# ప్రాణహితపై సీఎం ఫడ్నవిస్ తో చర్చలు

**రేపు కీలక సమావేశం**



**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో సాగునీటి పారుదల రంగానికి కొత్త ఊపిరి పోసేందుకు తెలంగాణ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో పాటు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల బృందం సోమవారం ముంబై వెళ్లనుంది. మహారాష్ట్ర ప్రభుత్వంతో అంతర్రాష్ట్ర సాగునీటి వివాదాలు, బ్యారేజీల నిర్మాణంపై ఈ పర్యటనలో కీలక చర్చలు జరగనున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో దాదాపు 2 లక్షల ఎకరాలకు నీరందించే లక్ష్యంతో ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తున బ్యారేజీ నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించడమే ప్రధాన అజెండాగా ముంబై పర్యటన సాగనుంది.

కేఆర్ ఎంబి సమావేశం వాయిదా

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ముంబై పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరు కాలేరని తెలంగాణ ఇంజనీర్‌ఇన్‌చీఫ్ కేఆర్ఎంబీకి లేఖ ద్వారా తెలియజేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు సంబంధించిన కీలక చర్చల నిమిత్తం ముఖ్యమంత్రి మహారాష్ట్రకు వెళుతున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ కారణం చేత సమావేశాన్ని వాయిదా వేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న కేఆర్ఎంబీ, సమావేశాన్ని మంగళవారానికి రీషెడ్యూల్ చేసింది. ఈ మార్పునకు సంబంధించిన సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు అధికారికంగా తెలియజేసింది. తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలు, నీటి పంపిణీకి సంబంధించిన కీలక అంశాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. 152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే మహారాష్ట్ర సరిహద్దుల్లో కలిగే ముంపు ప్రభావం, లభ్యమయ్యే నీటి పరిమాణంపై ఇప్పటికే సాంకేతిక నివేదికలను సిద్ధం చేశారు. ఒకవేళ బ్యారేజీ ఎత్తును 150 మీటర్లుగా నిర్ణయిస్తే, అక్కడి నుంచి ఎల్లంపల్లి రిజర్వాయర్ వరకు ఎంత పరిమాణంలో నీటిని తరలించవచ్చనే సాంకేతిక వివరాలు, లెక్కలపై సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే అధికారుల నుంచి పూర్తి సమాచారాన్ని సేకరించి అవగాహనకు వచ్చారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో జరగనున్న ఈ కీలక భేటీ సఫలమైతే.. ఉత్తర తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు కొత్త ఉత్సాహం లభించడంతో పాటు వేలాది ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి రానుంది.




# మున్సిపల్ ఉద్యోగిపై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ నల్లబ్యాడ్జీలతో నిరసన

- ...బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉద్యోగుల నిరసన

**బెల్లంపల్లి, మహా**:బెల్లంపల్లి మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారిపై మాజీ కౌన్సిలర్ తాండ రామకృష్ణ అనుచితంగా వ్యవహరిస్తూ, అసభ్య పదజాలంతో దుర్భాషలాడిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ మున్సిపల్ కార్యాలయ సిబ్బంది శనివారం రోజున నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, టిపిఓ సునీల్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 23వ తేదీన మాజీ కౌన్సిలర్ తాండ రామకృష్ణ బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగానికి వచ్చి, రోడ్డు విస్తరణకు సంబంధించిన ఆర్టిపి సర్టిఫికెట్ ఇవ్వాలని టౌన్ ప్లానింగ్ అధికారిని కోరడంతో దీనిపై స్పందించిన టిపిఓ కోరిన సమాచారాన్ని నిబంధనలకు అనుగుణంగా సమర్పించాల్సి ఉంటుందని, సంబంధిత సమాచారాన్ని సమాచార హక్కు చట్టం కింద అధికారికంగా దరఖాస్తు చేసుకున్నట్లయితే, దరఖాస్తును పరిశీలించి, వర్తించే నిబంధనల ప్రకారం అందుబాటులో ఉన్న సమాచారాన్ని అందించడం జరుగుతుందని వివరించినట్లు తెలిపారు.అయితే ఈ విషయంపై తాండ రామకృష్ణ అసహనం వ్యక్తం చేస్తూ, విధి నిర్వహణలో ఉన్న టౌన్ ప్లానింగ్ అధికారితో అనుచితంగా మాట్లాడి, తీవ్ర పదజాలంతో దుర్భాషలాడుతూ వ్యవహరించినట్లు కార్యాలయ సిబ్బంది పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారితో గౌరవప్రదంగా వ్యవహరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఒక అధికారి నిబంధనల ప్రకారం సమాచారాన్ని అందించేందుకు వివరణ ఇచ్చినప్పుడు, దానిని తప్పుగా అర్థం చేసుకుని లేదా అసహనంతో దుర్భాషలాడటం సమంజసం కాదని సిబ్బంది అభిప్రాయపడ్డారు.ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు సేవలందించేందుకు, చట్టాలు మరియు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించేందుకు నియమితులవుతారు. ప్రజాప్రతినిధులుగా పనిచేసిన వారు సైతం ప్రభుత్వ ఉద్యోగుల విధి నిర్వహణను గౌరవిస్తూ, సమస్యలు లేదా అభ్యంతరాలు ఉన్నప్పుడు వాటిని చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని సిబ్బంది సూచించారు. కార్యాలయాల్లో ప్రశాంతమైన, గౌరవప్రదమైన వాతావరణం కొనసాగడం ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి అత్యంత అవసరమని పేర్కొన్నారు.విధి నిర్వహణలో ఉన్న అధికారుల పట్ల అనుచితంగా వ్యవహరించడం, వ్యక్తిగత దూషణలకు పాల్పడడం వంటి ఘటనలు ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, ప్రభుత్వ కార్యాలయాల పని తీరుపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.ఈ నేపథ్యంలో, టౌన్ ప్లానింగ్ అధికారికి సంఘీభావం ప్రకటిస్తూ, కార్యాలయ సిబ్బంది అందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల గౌరవాన్ని కాపాడాలని, విధి నిర్వహణలో ఉన్న అధికారులకు తగిన రక్షణ మరియు సహకారం అందించాలని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.ప్రజలకు అందించాల్సిన మున్సిపల్ సేవలు ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగుతాయని, కార్యాలయ సిబ్బంది చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, సంబంధిత నిబంధనలకు అనుగుణంగా తమ విధులను నిర్వర్తిస్తారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల మనసు గెలవడమే పోలీసుల విజయం!

- అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా 15వ బెటాలియన్‌లో వ్యాసరచన పోటీలు



**సత్తుపల్లి, అక్టోబర్ 24**:ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందిస్తూ, బాధితులకు అండగా నిలిచి, సేవాభావంతో విధులు నిర్వర్తించడమే పోలీసుల విజయానికి అసలైన కొలమానమనే సందేశంతో 15వ బెటాలియన్ టీజీఎస్పీలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం సత్తుపల్లిలోని బెటాలియన్ ప్రాంగణంలో అధికారులు, సిబ్బందికి ఈ పోటీలు ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ కమాండెంట్ బి. వినాయకరావు పోటీలను ప్రారంభించారు.

**ప్రజల ఆకాంక్షలు.. పోలీసుల బాధ్యతలు**

పోలీసు వ్యవస్థపై పౌరుల్లో విశ్వాసం, గౌరవం పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆర్ఎస్ఐ, ఆపై స్థాయి అధికారులకు వ్యాసరచన నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో పోలీసుల నుంచి ప్రజలు ఆశించే సేవలపై ఏఆర్ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లకు పోటీలు నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రజలతో సత్సంబంధాలు, బాధ్యతాయుత ప్రవర్తన ప్రాధాన్యాన్ని ఈ అంశాల ద్వారా వివరించే ప్రయత్నం చేశారు.

**సామాజిక మాధ్యమాల వినియోగంపై దృష్టి**

పోలీసు అధికారుల జీవితంలో సామాజిక మాధ్యమాల పాత్ర, వాటిని వ్యక్తిగత, సామాజిక ప్రయోజనాలకు సద్వినియోగం చేసుకునే మార్గాలపైనా వ్యాసరచన అంశాలను రూపొందించారు. వాటికి బానిస కాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. సిబ్బందిలో ప్రజాసేవ పట్ల నిబద్ధతను పెంపొందించడం, పోలీసు-ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేయడం, సామాజిక మాధ్యమాల వినియోగంపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కె.వి. గోపాల్, ఆర్ఎస్ఐలు సూర్య, రంగనాయక్, అనిల్, శ్రీనాథ్, నాగేశ్వరరావుతో పాటు బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.



# అడిషనల్ డీసీపీని కలిసిన నరకాసుర ఉత్సవ కమిటీ

**కరీమాబాద్,మహా** : నవంబర్ 6వ తేదీ దీపావళి పండుగ సందర్భంగా నరకాసుర వధ ఉత్సవాల్లో భాగంగా పాల్గొనే నగర ప్రజలకు వాహనదారులకు ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ట్రాఫిక్ ను నియంత్రించడానికి తగు ఏర్పాట్లు చేయాలని కోరుతూ శనివారం వరంగల్ నగర అడిషనల్ డీసీపీ ట్రాఫిక్ రాయల ప్రభాకర్ రావుకు నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మరుపల్ల రవి ఆధ్వర్యంలో ట్రాఫిక్ అడిషనల్ డీసీపీకి పూల మొక్కను అందజేసి శాలువాతో సత్కరించి వినతి పత్రం తోపాటు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరకాసుర వధ ఉత్సవాలు వరంగల్ లోని ఉర్సు గుట్ట కుడా మైదానంలో సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 9:30 వరకు ఉత్సవాలు జరుగుతాయని, ఈ ఉత్సవాలను తిలకించడానికి ప్రజా ప్రతినిధులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు జిల్లా ఉన్నతాధికారులు వేలాది మంది ప్రజలు వాహనాల్లో విచ్చేస్తారని నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మరుపల్ల రవి అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్ కు వివరించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్ మాట్లాడుతూ నరకాసుర వధ ఉత్సవాలు పెద్ద ఎత్తున జరుగుతున్నందున వాహనదారులు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. ఆహ్వాన పత్రికను అందజేసిన వారిలో నరకాసుర వద ఉత్సవ కమిటీ ప్రతినిధులు మరుపల్ల గౌతం దూడే బాలకోమురెల్లి వనం కుమార్ కుండె రాజు ఆవునూరు ఐలేశం దాసరి రాజు కుండే సదానందం, తదితరులు ఉన్నారు



# 967.864 కిలోల గంజాయిని ధ్వంసం చేసిన పోలీసులు

- వరంగల్, క్రైమ్ మహా ; వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీగా
- పట్టుబడిన గంజాయిని పోలీసులు ధ్వంసం చేసారు.

తెలంగాణా యాంటీ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ ఆదేశాల మేరకు, వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 106 కేసులకు సంబంధించి, స్వాధీనం చేసుకున్న 967.864 కిలోల గంజాయిని, సుమారు రూ. 4,83,93,200 (రూ.4.83 కోట్లు) విలువైన గంజాయిని, డ్రగ్ డిస్పోజల్ కమిటీ వారు నిబంధనల ప్రకారం ధ్వంసం చేశారు. డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం హనుమకొండ మండలం అమ్మవారిపేట గ్రామ శివారులో ఉన్న కాకతీయ మెడిక్లీన్ సర్విస్ వారి భస్మీకరణ ప్లాంట్ లో గంజాయిని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా డీసీపీ అంకిత్ కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ నిరంతరం చర్యలు చేపడుతోందని, మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటూ, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి పోలీస్ శాఖ కృషి చేస్తోందని డీసీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, సీసీఆర్బీ ఏసీపీ డేవిడ్ రాజు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పాత్రికేయుడు సమ్మన్న తల్లికి ఘన నివాళి

**పెద్దపల్లి మహా :** మంథని: మంథని పట్టణానికి చెందిన ఆంధ్రజ్యోతి సీనియర్ పాత్రికేయుడు పోతరాజు సమ్మన్న మాతృమూర్తి స్వర్గీయ పోతరాజు వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆమె కుటుంబాన్ని పలువురు ప్రముఖులు పరామర్శించి, వెంకటమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రఘోత్తం రెడ్డి, రమణ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉప్పట్ల శ్రీనివాస్, గోటికార్ కిషన్, వి.కె. రవి, అరెల్లి కిరణ్, మాచిడి రాము, బీజేపీ నాయకుడు రాపర్తి సంతోష్‌తో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణన కులగణనలో బీసీ కాలాన్ని ప్రవేశ పెట్టాలి

- తెలంగాణ కాంగ్రెస్ (ప్రభుత్వం) ఇచ్చిన 3 డిక్లరేషన్లను అమలు చెయ్యాలి
- బిఎల్ఎఫ్ బిఎల్ఎఫ్ నాయకుల డిమాండ్
- నవంబర్ 1 నాడు మంచిర్యాల జిల్లా కేంద్రం లో జరిగే రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలి



**బెల్లంపల్లి, మహా:**కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణన కులగణనలో బీసీ కాలాన్ని ప్రవేశ పెట్టాలని, తెలంగాణ కాంగ్రెస్ (ప్రభుత్వం)ఇచ్చిన 3 డిక్లరేషన్లను అమలు చెయ్యాలని, బిఎల్ఎఫ్ బిఎల్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఎం సి పి ఐ యు పార్టీ కార్యాలయం లో బహుజన లెఫ్ట్ ప్రంట్ సమావేశం పసులేటివెంకటేష్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా నాయకులు,రాష్ట్ర కన్వీనర్ సంకె రవి, సబ్బని రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఏడాది నవంబర్ ఒకటో తేదీన బిఎల్ఎఫ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం పిలుపులో భాగంగా 2026 నవంబర్ 1 న మంచిర్యాల జిల్లాకేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణన కులగణనలో బీసీ కాలాన్ని పెట్టకుండా బీసీ ల జనాభా,ఆర్థిక, సామాజిక,రాజకీయ లెక్కలు తియ్యడం లేదని దీంతో బీసీ లు భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉన్నది.బీసీ కాలాన్ని పెట్టాలని డిమాండ్ చేయడం జరుగుతుందనీ, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రైతు బీసీ, ఎస్సీ ,ఎస్టీ, డిక్లరేషన్లు చేసి అధికారంలోకి వస్తే మూడు డిక్లరేషన్లను అమలు చేస్తామణి హామీ ఇచ్చిందని,అధికారంలోకి వచ్చి నేటికీ 3 సం.రాలు దాటిపోతున్న ఇచ్చిన డిక్లరేషన్లను అమలు చెయ్యడం లేదని .వాటిని మూలకు పడేయ్యడం జరిగిందని,బీసీ కాలాన్ని చేర్చాలని,3 డిక్లరేషన్లు అమలు చేయాలని కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తిసుకురావడం కోసం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చెయ్యడం జరిగిందని , సామాజిక సంస్థలు,నాయకులు, ఆలోచన పరులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో నాయకులు సబ్బని రాజేంద్రప్రసాద్,పసులేటివెంకటేష్, కన్నూరి సమ్మయ్య,తోగరి రాహులు,జెంజర్ల శేఖర్, శం శంభోజీ రాజేష్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. భోజీ రాజేష్,శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పనితీరుపైనే ప్రజల తీర్పు

( మొదట పేజీ తరువాయి )

ప్రస్తుత అభివృద్ధి , శాంతిభద్రతల అంశాలపై అత్యంత స్పష్టంగా, నిర్మొహమాటంగా మాట్లాడారు. రౌడీయిజాన్ని, నేరాలకు పాల్పడేవారిని ఏ సమాజమూ ఎప్పటికీ హర్షించదని తేల్చిచెప్పిన ఆయన.. గత పదేళ్లలో రాష్ట్రంలో శాంతిభద్రతలు అత్యుత్తమ స్థాయికి చేరాయని వెల్లడించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రిస్క్‌లో పెట్టి నక్సలిజాన్ని కంట్రోల్ చేశానని, ఫ్యాక్షనిజం, కమ్యూనలిజాన్ని గట్టిగా అణచివేశానని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లో నెలల తరబడి కర్ఫ్యూ ఉండేదనీ, తాను సీఎంగా ఉన్న సమయంలోనే దానిని పూర్తిగా కంట్రోల్ చేసి హైదరాబాద్‌ను ప్రశాంతమైన నగరంగా తీర్చిదిద్దామని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు కొత్త సమస్యలు ఎదురైనా వాటిని సమర్థవంతంగా అధిగమించి ముందుకు వెళ్లామని తెలిపారు.2019 నుంచి 2024 వరకు వైఎస్సార్‌సీపీ హయాంలో ఏపీలో అరాచకమే రాజ్యమేలిందని సీఎం తీవ్రంగా మండిపడ్డారు. రాష్ట్రంలో ఎన్ని రకాల అరాచకాలు చేయాలో అన్నీ చేశారని, కనీసం ఎలాంటి ముందస్తు నోటీసులు కూడా ఇవ్వకుండా తనను అక్రమంగా అరెస్ట్ చేశారని గుర్తుచేశారు. ఇటువంటి అరాచక పాలనతో విసిగిపోయిన ప్రజలు 2024 ఎన్నికల్లో తిరుగులేని తీర్పు ఇచ్చారని, చివరకు గొడ్డలి పార్టీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా కేవలం 11 సీట్లతో సరిపెట్టి పక్కన కూర్చోబెట్టారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీని అన్ని రంగాల్లో పునర్నిర్మాణం చేశామని, రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను అమాంతం పెంచామని సీఎం వెల్లడించారు. పెద్ద ఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలను రాష్ట్రానికి రప్పించామన్నారు. 'రాయలసీమ రైజింగ్', 'ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు' వంటి ప్రతిష్ఠాత్మక అంశాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం 96 కేంద్ర పథకాలకు వచ్చిన నిధులను దారి మళ్లించిందని, తమ ప్రభుత్వం వచ్చాక ఆ లోపాలన్నింటినీ సరిదిద్దామని స్పష్టం చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల ప్రాముఖ్యతను వివరిస్తూ.. స్థానిక ఎన్నికలను నిర్వహించకపోతే 16వ ఆర్థిక సంఘం ద్వారా కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాకుండా పోతాయని, ఆ నిధులు రాకపోతే గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతుందని సీఎం హెచ్చరించారు. అయితే ఈ ఎన్నికలను అడ్డుకోవడానికి ఏకంగా 59 పిటిషన్లు వేశారని మండిపడ్డారు. బీసీలకు సముచిత స్థానం కల్పిస్తూ రిజర్వేషన్లను పకడ్బందీగా అమలు చేశామని, ఎక్కడ బీసీలు ఉంటే అక్కడ వారికి సీట్లు కేటాయించామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును వేగంగా పూర్తి చేస్తున్నామని, కరవును సమర్థవంతంగా ఎదుర్కొంటున్నామని చెప్పారు. అయితే, ఇలాంటి మంచి పనులు చేసుకుంటూ పోతుంటే వైసీపీ నేతలు నిత్యం అడ్డుపడుతున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. గత రెండున్నరేళ్లుగా ఆ పార్టీ నేతలు జిల్లాలకు వెళ్లి అరాచకాలు సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడడమే కాకుండా, ఎస్ఐఆర్ (SIR) వచ్చిన తర్వాతే ఎన్నికలు పెట్టాలంటూ కోర్టుల చుట్టూ తిరిగారని విమర్శించారు. వారికి ఉన్న సహజమైన క్రిమినల్ మనస్తత్వంతో రాష్ట్రంలో అల్లర్లు సృష్టిస్తున్నారని, సాక్షాత్తు ఒక ఎంపీ తన వాహనాలను పంపి టీడీపీ కార్యకర్తలను తొక్కించే ప్రయత్నం చేశారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో ఒక పద్ధతి ప్రకారం హింసను ప్రేరేపించారని ముఖ్యమంత్రి ఆరోపించారు. రాయచోటిలో ఓ మాజీ ఎమ్మెల్యే పంజాబ్ నుంచి క్రిమినల్స్‌ను, మారణాయుధాలను తీసుకువచ్చి అరాచకాలు సృష్టించారని చెప్పారు. దర్శిలో వైసీపీ నేతలు పాల్పడిన అరాచకం, పోలీసులపై జరిపిన దాడిని ప్రజలందరూ ప్రత్యక్షంగా చూశారన్నారు. పులివెందుల, పుంగనూరు, రాయచోటి, దర్శి వంటి పలు ప్రాంతాలలో వైసీపీ నాయకులు సాగించిన అరాచకాలకు సంబంధించిన వాస్తవాలన్నీ ప్రజలకు తెలియాలని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.






# మంచినీటి లీకేజీని అరికట్టాలని హెచ్ఎండబ్ల్యూ జిఎంకు వినతి

జవహర్ నగర్, మహా : భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా మంచినీటి లీకేజీలను వెంటనే అరికట్టాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు జీఎం సునీల్ కు సిపిఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహ, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు సి.హెచ్. దశరథులు మాట్లాడుతూ... దేశంలో, రాష్ట్రంలో ప్రకృతి విపత్తులు 'ఎల్ నినో' ప్రభావం వల్ల తీవ్ర నీటి కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో తాగునీటితో పాటు సాగునీటి వనరులను కాపాడాలని, చుక్క నీరు కూడా వృథా కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. అయినప్పటికీ సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్ల వికలాంగుల కాలనీలో తరచూ మంచినీటి పైపులు లీకేజీ అయి అనేక లీటర్ల నీరు రోడ్లపై వృథాగా ప్రవహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల కాలనీ ప్రజలు తాగునీరు సరిగ్గా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యపై అధికారులు వెంటనే స్పందించి పరిపరిష్కరించాలని కోరారు. అదేవిధంగా, గిరి ప్రసాద్ నగర్‌లో గతంలో రోజు విడిచి రోజు సరఫరా అయ్యే తాగునీరు.. ప్రస్తుతం వారానికి ఒకసారి మాత్రమే ఇస్తున్నారని, అవి కూడా అరకొరగా రావడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. గిరి ప్రసాద్ నగర్ నీటి సమస్యను కూడా యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వి. వెంకటాచారి, ఏఐటీయూసీ నాయకులు ఎ. ఎల్లయ్య, రైతు సంఘం నాయకులు పి. నరసింహ, ఆదర్శనగర్ సిపిఐ కార్యదర్శి పి. కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగోళ్ళ సత్తా

మహా : న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో తెలుగు క్రికెటర్లు తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి అద్భుత ప్రదర్శనతో టీమిండియాను గెలిపించారు. ఓటమి అంచున ఉన్న జట్టును విజయతీరాలకు చేర్చడమే కాకుండా, మైదానంలో ఇద్దరూ తెలుగులో మాట్లాడుకుంటూ ఆడటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారి ప్రదర్శనపై ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రశంసల వర్షం కురిపించారు. ఈ మేరకు లోకేశ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. "తెలుగోడి సత్తా, తెలుగు భాష మాధుర్యం న్యూజిలాండ్ వేదికగా ప్రపంచానికి చాటిచెప్పిన తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డిలకు హృదయ పూర్వక అభినందనలు" అని ఆయన పేర్కొన్నారు. ఓటమి అంచుల నుంచి సమన్వయంతో ఆడి జట్టును గెలిపించారని కొనియాడారు. దీనికి సంబంధించిన క్రిక్‌బజ్ వీడియోను కూడా ఆయన తన పోస్టుకు జతచేశారు. లోకేశ్ పంచుకున్న ఈ వీడియోలో తిలక్, నితీశ్ క్రీజులో ఉండగా ఒకరితో ఒకరు తెలుగులో మాట్లాడుకోవడం స్పష్టంగా వినిపిస్తుంది. వ్యూహాత్మకంగా ఎలా ఆడాలో తెలుగులోనే చర్చించుకోవడం అందరినీ ఆకట్టుకుంది. ఈ వీడియోలో మరో విశేషం కూడా ఉంది. ఈ షోకు వ్యాఖ్యాతలుగా వ్యవహరించిన ప్రముఖ కామెంటేటర్ హర్షా భోగ్లే, మాజీ క్రికెటర్ దినేశ్ కార్తీక్ కూడా తెలుగులో మాట్లాడారు. హర్షా భోగ్లే పక్కా హైదరాబాదీ కాగా, దినేశ్ కార్తీక్ మూలాలు నెల్లూరు జిల్లాలో ఉన్నాయి. ఇక ఈ షోకు హోస్ట్‌గా ఉన్న నటి సయామీ ఖేర్, సాయి దుర్గా తేజ్ తొలి చిత్రం 'రేయ్' లో హీరోయిన్‌గా నటించడం గమనార్హం. మొత్తం మీద, కేవలం క్రీడా విజయమే కాకుండా, అంతర్జాతీయ వేదికపై తెలుగు భాషకు దక్కిన గౌరవంగా ఈ సంఘటనను పలువురు అభివర్ణిస్తున్నారు.

## కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో
# సీఎం చంద్రబాబు భేటీ

**ఢిల్లీ, మహా :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం దేశ రాజధాని ఢిల్లీలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన పలువురు కేంద్ర మంత్రులను కలుసుకుని రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ఇందులో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. దాదాపు అర్ధగంటపాటు సాగిన ఈ భేటీలో ఏపీకి కేంద్రం నుంచి అందాల్సిన సహకారం, రాష్ట్రంలోని తాజా పరిణామాలు మరియు పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు సమాచారం. అలాగే, ముఖ్యమంత్రి అధికారిక నివాసమైన 'వన్ జనపథ్'లో



కేంద్ర ఐటీ, కమ్యూనికేషన్లు, రైల్వేశాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై ఇరువురు చర్చలు జరిపారు. ఆదివారం ఉదయం 11:30 గంటలకు విజయవాడకు చేరుకోనున్నారు.



# ఓటముల నుంచి అధికార శిఖరాలకు..

**హైదరాబాద్, మహా :** రాజకీయాలు ఎవరికీ ఎరుపెక్కిన పూలబాటలు కావు..అవి కఠినమైన అగ్ని పరీక్షలు, దారులు లేని చోట దారులు తవ్వుకునే తెగింపు. సరిగ్గా ఇరవై ఏళ్ల క్రితం.. ఒక మారుమూల మండలం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా జెడ్పీటీసీగా రాజకీయ అరంగేట్రం చేసిన ఒక సామాన్య యోధుడు, కాలంతో పోరాడుతూ, ఓటముల బండరాళ్లను బద్దలుకొట్టుకుంటూ, ప్రతికూలతల సుడిగుండాలను ఈదుకుంటూ నేడు తెలంగాణ రాష్ట్ర పాలనా పగ్గాలు చేపట్టడం ఆధునిక రాజకీయ చరిత్రలో ఒక అరుదైన సంచలనం. మిడ్జిల్ నుంచి మల్కాజిగిరి మీదుగా సాగిన ఈ రెండు దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణం కేవలం పదవుల పరంపర కాదు; అది పట్టుదల, ఆత్మస్థైర్యం, క్షణం విశ్రమించని దూకుడు కలగలిపిన ఒక అద్భుతమైన రాజకీయ కావ్యం. గెలుపోటముల మధ్య ఊగిసలాడిన ఆ ప్రయాణమే నేడు రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చివేసింది

ఒకప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన నాయకుడు.. ఆ తరువాత ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, పార్లమెంటు సభ్యుడిగా, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎదిగి చివరకు తెలంగాణ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించారు. ఆయనే అనుముల రేవంత్ రెడ్డి. 2006 జూలై 4న మిడ్జిల్‌లో ప్రారంభమైన ఆయన ప్రజాప్రతినిధి ప్రస్థానం ఇరవై సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ రెండు దశాబ్దాల ప్రయాణంలో విజయాల వెనుక పరాజయాలు, పదవుల వెనుక రాజకీయ సవాళ్లు, ఎదుగుదల మధ్య వివాదాలు, ప్రతిపక్ష పోరాటాల అనంతరం అధికార బాధ్యతలు ఎదురయ్యాయి. 2018లో కొడంగల్‌లో ఓడిన నాయకుడు, 2019లో లోక్‌సభకు ఎన్నికై, 2023లో అదే కొడంగల్‌లో తిరిగి విజయం సాధించి రాష్ట్ర ముఖ్యమంత్రి కావడం ఈ ప్రయాణంలోని అత్యంత కీలకమైన మలుపు.

**మిడ్జిల్ నుంచి మొదలైన రాజకీయ ప్రస్థానం.**

విద్యార్థి దశలో రాజకీయ కార్యకలాపాలతో పరిచయం పెంచుకున్న రేవంత్ రెడ్డి 2006లో ఎన్నికల రాజకీయాల్లోకి ప్రవేశించారు. మహబూబ్‌నగర్ ప్రాంతంలోని మిడ్జిల్ మండలం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. పార్టీ గుర్తు కంటే వ్యక్తిగత రాజకీయ పరిచయాలు, స్థానిక స్థాయి మద్దతుతో సాధించిన ఈ విజయం ఆయనకు ప్రజాప్రతినిధిగా తొలి గుర్తింపునిచ్చింది. ఏడాది తరువాత స్థానిక సంస్థల ప్రతినిధుల కోటాలో శాసనమండలికి ఎన్నిక కావడంతో రాష్ట్ర రాజకీయాల్లో ఆయన ప్రస్థానం మరో మెట్టు ఎక్కింది.

**కొడంగల్‌తో బలమైన అనుబంధం.**

శాసనమండలి సభ్యుడిగా ఉన్న సమయంలో తెలుగుదేశం పార్టీలో చేరిన రేవంత్ రెడ్డి 2009 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత జరిగిన ఎన్నికల్లోనూ అదే నియోజకవర్గం నుంచి గెలిచి రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం తెలంగాణ తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. ఈ దశలో ఆయన గుర్తింపు నియోజకవర్గ నాయకుడి స్థాయి నుంచి రాష్ట్రస్థాయి రాజకీయ నాయకుడి స్థాయికి విస్తరించింది.

**రాజకీయ జీవితంపై చెరగని చర్చ.**

2015లో శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో వెలుగులోకి వచ్చిన ఓటుకు నగదు కేసు రేవంత్ రెడ్డి రాజకీయ జీవితంలో అత్యంత వివాదాస్పద ఘట్టాల్లో ఒకటిగా నిలిచింది. నామినేటెడ్ ఎమ్మెల్యేకు లంచం ఇవ్వడానికి ప్రయత్నించారనే ఆరోపణలతో అవినీతి నిరోధక శాఖ కేసు నమోదు చేయడం, ఆయన అరెస్టు కావడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ వ్యవహారం ఆయన రాజకీయ జీవితంపై ప్రతికూల ప్రభావం చూపినప్పటికీ, తదుపరి సంవత్సరాల్లో ఆయన రాజకీయ కార్యకలాపాలు కొనసాగాయి. ఈ



కేసులోని ఆరోపణలు, న్యాయపరమైన పరిణామాలు, తుది నిర్ణయాలను వేర్వేరుగా చూడాల్సి ఉంటుంది.

**కొత్త వేదికపై కొత్త పోరాటం.**

2017 అక్టోబర్‌లో తెలుగుదేశం పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరడం రేవంత్ రెడ్డి రాజకీయ జీవితంలో కీలకమైన మలుపు. అప్పటికి తెలంగాణలో అధికారంలో ఉన్న తెలంగాణ రాష్ట్ర సమితికి వ్యతిరేకంగా కాంగ్రెస్ తన రాజకీయ బలాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి చేరిక రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే కొత్త పార్టీలో తన స్థానాన్ని బలోపేతం చేసుకోవడం, సీనియర్ నాయకులతో సమన్వయం సాధించడం, పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లడం ఆయన ముందున్న సవాళ్లు.

**రాజకీయ ప్రస్థానంలో పెద్ద ఎదురుదెబ్బ.**

కాంగ్రెస్ అభ్యర్థిగా 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుంచి పోటీ చేసిన రేవంత్ రెడ్డి ఓటమి పాలయ్యారు. గతంలో రెండుసార్లు గెలిచిన నియోజకవర్గంలోనే పరాజయం ఎదురవడం ఆయన రాజకీయ జీవితంలో కీలకమైన మలుపు. పార్టీ మారిన తరువాత వచ్చిన ఈ ఫలితం ఆయనకు ఎదురైన ప్రధాన ఎన్నికల ఎదురుదెబ్బగా నిలిచింది. అయితే కొడంగల్‌లో ఓటమితో ఆయన రాజకీయ ప్రయాణం ఆగిపోలేదు. ఆరు నెలల్లోనే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుని విజయం సాధించారు.

**పరాజయం తర్వాత పునరాగమనం.**

2019 లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన రేవంత్ రెడ్డి విజయం సాధించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తరువాత పార్లమెంటుకు ఎన్నిక కావడం ఆయన రాజకీయ ప్రస్థానంలో కీలకమైన పునరాగమనంగా నిలిచింది. లోక్‌సభ సభ్యుడిగా జాతీయ రాజకీయాల్లో పనిచేసే అవకాశం లభించడంతో పాటు తెలంగాణ కాంగ్రెస్‌లో ఆయన ప్రాధాన్యం మరింత పెరిగింది. ఒక నియోజకవర్గంలో ఓటమి ఎదురైనా, మరో ఎన్నికలో ప్రజల మద్దతు సాధించడం రాజకీయాల్లో నాయకుల ప్రయాణం ఎప్పుడూ ఒకే దిశలో సాగదనే విషయాన్ని స్పష్టం చేసింది.

**అధికార మార్పునకు దారితీసిన ప్రజాతీర్పు.**

2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 119 స్థానాలకు గాను 64 స్థానాలను గెలుచుకుని ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ సాధించింది. పదేళ్లపాటు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం ప్రతిపక్షంలోకి వెళ్లగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి పార్టీ ప్రచారంలో ప్రధాన పాత్ర పోషించారు. కొడంగల్ నుంచి విజయం సాధించిన ఆయన, కామారెడ్డిలో మాత్రం ఓటమి ఎదుర్కొన్నారు. ఒకే ఎన్నికలో రెండు నియోజకవర్గాల్లో పోటీ చేసి ఒకచోట గెలవడం, మరోచోట ఓడిపోవడం ఆయన రాజకీయ ప్రస్థానంలోని ప్రత్యేక పరిణామంగా నిలిచింది.

**చరిత్రను నిర్ణయిం చేది పదవి కాదు.. ప్రజల తీర్పు.**

మిడ్జిల్‌లో స్వతంత్ర అభ్యర్థిగా ప్రారంభమైన రేవంత్ రెడ్డి ప్రజాప్రతినిధి ప్రస్థానం రెండు దశాబ్దాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి పదవికి చేరింది. ఈ ప్రయాణంలో విజయాలు ఉన్నాయి, పరాజయాలు ఉన్నాయి, వివాదాలు ఉన్నాయి, కీలక పదవులు ఉన్నాయి. రాజకీయంగా ఆయన ఎదిగిన తీరు ఎంత ముఖ్యమో, అధికారంలో ఆయన తీసుకునే నిర్ణయాలు ప్రజల జీవితాలపై చూపే ప్రభావం కూడా అంతే ముఖ్యం. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులు, పారదర్శకత, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ బాధ్యతాయుతమైన పనితీరు వంటి అంశాలే ఆయన రాజకీయ వారసత్వాన్ని నిర్ణయించనున్నాయి.

### కాంగ్రెస్‌ను అధికార దిశగా నడిపించే బాధ్యత.

2021లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన రేవంత్ రెడ్డి పార్టీని పునర్వ్యవస్థీకరించే బాధ్యత చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారానికి దూరంగా ఉన్న సమయంలో కార్యకర్తలను సమీకరించడం, నాయకుల మధ్య సమన్వయం పెంచడం, ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేయడం, ప్రజా సమస్యలను రాజకీయ అజెండాలోకి తీసుకురావడం వంటి సవాళ్లు ఎదురయ్యాయి. ఆయన నాయకత్వంలో పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలను విస్తరించింది. అయితే 2023 విజయాన్ని ఒక్క నాయకుడి కృషికి మాత్రమే ఆపాదించకుండా, పార్టీ సమిష్టి ప్రయత్నాలు, ప్రజల అభిప్రాయాలు, అప్పటి రాజకీయ పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

### రాజకీయ జీవితానికి అసలైన పరీక్ష.

రేవంత్ రెడ్డి రాజకీయ ప్రయాణాన్ని కేవలం పదవుల జాబితాగా చూడలేం. 2006లో తొలి విజయం, 2009-2014లో అసెంబ్లీ విజయాలు, 2015లో వివాదం, 2017లో పార్టీ మార్పు, 2018లో ఓటమి, 2019లో పార్లమెంటు విజయం, 2021లో రాష్ట్ర పార్టీ అధ్యక్ష బాధ్యతలు, 2023లో ముఖ్యమంత్రి పదవి.. ప్రతి ఘట్టం వేర్వేరు రాజకీయ పరిస్థితుల్లో చోటుచేసుకుంది. ఈ పరిణామాల మధ్య ఆయన రాజకీయంగా ఎదిగిన తీరు ఒక కోణమైతే, ముఖ్యమంత్రిగా ప్రజల సమస్యలకు పరిష్కారాలు చూపడం మరో కీలకమైన కోణం. ఎన్నికల విజయాలు నాయకుడికి అధికారాన్ని అందిస్తాయి; పాలనలో సాధించిన ఫలితాలు మాత్రం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే ప్రమాణాలుగా మారతాయి.

### ఇరవై ఏళ్ల ప్రయాణంలో కీలక మైలురాయి.

2023 డిసెంబర్ 7న రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధిగా ప్రారంభమైన ఆయన ప్రస్థానం రాష్ట్ర ప్రభుత్వానికి నాయకత్వం వహించే స్థాయికి చేరింది. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, పార్లమెంటు సభ్యుడు, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు వంటి బాధ్యతల అనంతరం ముఖ్యమంత్రి పదవిని చేపట్టడం ఆయన రాజకీయ జీవితంలో అత్యున్నత ఘట్టంగా నిలిచింది. అయితే అధికారాన్ని సాధించడం రాజకీయ ప్రయాణంలో ఒక మైలురాయి మాత్రమే. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి, వ్యవసాయం, విద్య, వైద్యం, ఆర్థిక నిర్వహణ వంటి అంశాల్లో ప్రభుత్వ పనితీరే తదుపరి దశలో ప్రజల అంచనాలకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది.



# 60 అడుగుల నయనతార కటౌట్

- **నయనతారపై ప్రశంసలు కురిపించిన నటి రెజీనా కసాండ్రా**
- **'మూకుత్తి అమ్మన్ 2' చిత్రం కోసం ఏర్పాటు చేసిన 60 అడుగుల కటౌట్‌పై స్పందన**
- **ఒక నటికి ఇంత పెద్ద కటౌట్ ఏర్పాటు చేయడం ఇదే తొలిసారని వ్యాఖ్య**
- **నయన్ పై ప్రశంసల జల్లు**

మహా : లేడీ సూపర్ స్టార్ నయనతారపై ప్రముఖ నటి రెజీనా కసాండ్రా ప్రశంసల వర్షం కురిపించారు. సాధారణంగా అగ్ర హీరోలకు మాత్రమే పరిమితమయ్యే భారీ కటౌట్లను నయనతార కోసం ఏర్పాటు చేయడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఒక నటికి దక్కిన ఈ అరుదైన గౌరవం నిజంగా చారిత్రాత్మకమని ఆమె అభివర్ణించారు. వివరాల్లోకి వెళితే, తమిళనాడులో 'మూకుత్తి అమ్మన్ 2' చిత్రం ప్రచారంలో భాగంగా నయనతారకు 60 అడుగుల భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. ఎరుపు, బంగారు వర్ణ వస్త్రాలతో అమ్మవారి అలంకారంలో, చేతిలో త్రిశూలం ధరించిన నయనతార కటౌట్ అందరినీ విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ కటౌట్ ఫొటోను తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్న రెజీనా, నయనతారను ప్రత్యేకంగా అభినందించారు. "ఒక నటి కోసం ఇంత భారీ కటౌట్ ఏర్పాటు చేయడం బహుశా ఇదే తొలిసారి. నయనతార సంకల్ప బలానికి, విజయం పట్ల ఆమెకున్న అంకితభావానికి ఇది నిదర్శనం" అని రెజీనా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె నయనతారను ట్యాగ్ చేస్తూ తన సంతోషాన్ని పంచుకున్నారు. దక్షిణాది చిత్ర పరిశ్రమలో భారీ కటౌట్లు స్టార్‌డమ్‌కు నిలువుటద్దాలుగా నిలుస్తాయి. ఇప్పటివరకు కేవలం అగ్ర హీరోలకు మాత్రమే ఈ స్థాయిలో కటౌట్లు ఏర్పాటు చేసే సంప్రదాయం కొనసాగుతోంది. ఆ సంప్రదాయాన్ని అధిగమిస్తూ, ఒక నటి కోసం 60 అడుగుల కటౌట్ ఏర్పాటు చేయడం సినీ చరిత్రలో ఒక మైలురాయిగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం రెజీనా చేసిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ పోస్ట్‌కు వేలాది లైకులు వస్తుండగా, నెటిజన్ల నుంచి భిన్నమైన స్పందనలు వ్యక్తమవుతున్నాయి. కొందరు నయనతార సాధించిన ఘనతను కొనియాడుతుండగా, మరికొందరు ఈ కటౌట్ స్పాన్సర్‌షిప్ వివరాల గురించి ఆరా తీస్తున్నారు.



# డంపింగ్ సమస్య పై రాజకీయ పోటీ కాదు... ప్రజా ఉద్యమాలతో కలిసి రండి

- జిల్లాలోని ఎంపీ ఎమ్మెల్యేలు మద్దతు తెలపడం హర్షనీయం.
- డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్షావలి.

**జవహర్ నగర్, మహా:** జవహర్ నగర్ డంపింగ్ సమస్యపై రాజకీయ పోటీ కాదు అని ప్రజా ఉద్యమకారులతో కలిసి ముందుకు రావాలని జిల్లాలోని ఎంపీ ఎమ్మెల్యేలు డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా మద్దతు తెలపడం హర్షనీయమని డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్షావలి పేర్కొన్నారు. షేక్షావలి మీడియాతో మాట్లాడుతూ రామ్కీ చెత్త డంపింగ్ యార్డ్ ఎత్తివేత కోసం గత ఐదు నెలలుగా ప్రజా ఉద్యమం కొనసాగిస్తుండగా తాజాగా మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి చేస్తున్న ప్రకటనలు స్వాగతించారు. ప్రజా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపని ప్రభుత్వం అఖిలపక్షంలో కొనసాగడం కంటే దాని నుంచి వైదొలిగి డంపింగ్ యార్డ్ తొలగింపునకు ఉమ్మడిగా పోరాడాలని డిమాండ్ చేశారు. జవహర్ నగర్లో నెలకొని ఉన్న డంపింగ్ యార్డ్ వల్ల పర్యావరణానికి ప్రజల ఆరోగ్యానికి కలుగుతున్న నష్టాలపై జవహర్ నగర్ ప్రజా హక్కుల పరిరక్షణ పోరాట కమిటీ నుండి నేటి జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ వరకు వివిధ ప్రజా సంఘాలు రాజకీయ పార్టీలు నిరంతరం పోరాటం చేస్తున్నాయని తెలిపారు. ఈ ఉద్యమానికి ప్రజల్లో పెరుగుతున్న మద్దతు నేపథ్యంలో ఎంపీ ఎమ్మెల్యేలు పోటాపోటీగా దీక్షలు సమావేశాలు చేయడం ప్రజల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయన్నారు. డంపింగ్ యార్డ్ ను తొలగించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏం చేయడానికి అయినా బిజెపి సిద్ధమని ఎంపీ ఈటెల ప్రకటించిన నేపథ్యంలో డంపింగ్ యార్డ్ కు సంబంధించిన కీలక పర్యావరణ అనుమతుల ఉపసంహరణకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని తెలిపారు. ప్రజలకు స్పష్టమైన హామీలు ఇవ్వడంతో పాటు ఆచరణలో ఫలితాలు సాధించేందుకు ఎంపీ ఈటల రాజేందర్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సంయుక్తంగా ముందుకు రావాలన్నారు.

# సైబర్ నేరాల ఫిర్యాదుల పరిష్కారంలో తక్షణమే స్పందించాలి

- సైబర్ వారియర్స్‌తో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సైబర్ నేరాల ఫిర్యాదుల పరిష్కారంలో తక్షణమే స్పందించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సైబర్ వారియర్స్‌తో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించి వారి విధులు బాధ్యతలు పెండింగ్ సైబర్ నేరాల కేసుల దర్యాప్తు పురోగతి ఫిర్యాదుల పరిష్కారం వివిధ పోర్టల్లపై సిబ్బందికి ఉన్న అవగాహన పీటీ వారెంట్ల అమలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాల బాధితులు పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చినప్పుడు తక్షణమే స్పందించి మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఫిర్యాదులను స్వీకరించిన వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టి బాధితులకు పోలీస్ స్టేషన్ స్థాయిలోనే న్యాయం జరిగేలా కృషి చేయాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించాలని తెలిపారు. ఎన్సిఆర్పి జిఆర్ఎం ఎంఆర్ఎఫ్ సహయోగ్ సమన్వయ సైబర్ క్రైమ్ అనలిటిక్స్ అండ్ ప్రాసిక్యూషన్ సిస్టమ్ వంటి పోర్టల్ల విధులు వినియోగంపై సైబర్ వారియర్స్ పూర్తి అవగాహన కలిగి ఉండాలని వాటిని సమర్థవంతంగా వినియోగించుకుంటూ ఫిర్యాదుల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. 1930 సైబర్ హెల్ప్‌లైన్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి ఆర్థిక సైబర్ మోసాల బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పీటీ వారెంట్లను గుర్తించి వాటి అమలును వేగవంతం చేయాలని సంబంధిత దర్యాప్తు అధికారులతో సమన్వయం చేసుకుంటూ అమలైన వారెంట్ల వివరాలను సైబర్ క్రైమ్ అనలిటిక్స్ అండ్ ప్రాసిక్యూషన్ సిస్టమ్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సైబర్ నేరాల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ ప్రజలకు సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పించాలని సైబర్ వారియర్స్ తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ పెండింగ్ ఫిర్యాదులు కేసుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెల్ సీఐ నరేష్, ఎస్సై జుబేదా బేగం, డిఫోర్సి సిబ్బంది, సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.



## శంషాబాద్ విమానాశ్రయంలో భారీగా విదేశీ కరెన్సీ పట్టివేత

**రాజేంద్రనగర్ మహా :** శంషాబాద్ నుంచి కౌలాలంపూర్ వెళ్లేందుకు సిద్ధమైన ఇద్దరు ప్రయాణికుల వద్ద సుమారు రూ 1.56 కోట్ల విలువైన విదేశీ కరెన్సీని శనివారం డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ నుండి కౌలాలంపూర్ వెళ్లేందుకు ఎయిర్ ఏషియా (ఎకే 68) విమానం ఎక్కడానికి సిద్ధమైన ఇద్దరు ప్రయాణికులను అధికారులు అడ్డుకున్నారు. నిందితులు తమ ట్రావెలీ బ్యాగ్‌లలో బట్టల మధ్య బ్లాక్ ప్లాస్టిక్ కవర్లలో కరెన్సీని రహస్యంగా దాచి తరలిస్తున్నారు. అధికారులకు అనుమానం రావడంతో లగేజ్ను తనిఖీలు చేశారు. తనిఖీల్లో రూ 1.56 కోట్ల విలువైన విదేశీ కరెన్సీ లభించింది. ఈ నగదుకు సరైన ధృవీకరణ పత్రాలు లేకపోవడంతో, కస్టమ్స్ చట్టం 1962 ప్రకారం ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు

# మహిళలకు చీరల పంపిణీ

- పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం అభినందనీయం
- మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి,

**కుషాయిగూడ, మహా:** హనుమాన్‌నగర్‌లో గునిశాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 500 మంది నిరుపేద మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ చైర్‌పర్సన్ బి. సంతోషి లలిత తన కుమారుడు బి. రోహిత్ కుమార్ 18వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పుట్టినరోజు వేడుకలను కేవలం కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య జరుపుకోవడమే కాకుండా సమాజానికి ఉపయోగపడే విధంగా నిర్వహించాలనే ఉద్దేశంతో నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పత్తి కుమార్, రాష్ట్ర ఓబీసీ కన్వీనర్ పాత కోటి రామలింగం, బీసీ నాయకుడు సింగం కిరణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ పుట్టినరోజు వంటి వ్యక్తిగత వేడుకలను సేవా కార్యక్రమాలతో ముడిపెట్టి పేదలకు సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చేయూతనివ్వడం ద్వారా సామాజిక బాధ్యతను నెరవేర్చవచ్చన్నారు. నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేయడం ద్వారా వారి ముఖాల్లో ఆనందాన్ని నింపడం సంతోషకరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైనంత మేరకు పేదలకు సహాయం అందించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గునిశాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులు, దివ్యాంగులు, అనాథలు, ఆర్థికంగా వెనుకబడిన మహిళలు, చిన్నారులకు సహాయ సహకారాలు అందిస్తూ వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సేవాభావాన్ని పెంపొందించడంతో పాటు ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. సేవా దృక్పథంతో ముందుకు సాగుతూ అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం ద్వారా సమాజంలో మానవత్వం, పరస్పర సహకారం మరింత బలోపేతమవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్‌పర్సన్ బి. సంతోషి లలిత మాట్లాడుతూ తమ కుమారుడి 18వ జన్మదినాన్ని పురస్కరించుకుని నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు.



# రబీలో ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలి..

- నేల ఆరోగ్య పరిరక్షణపై రైతులకు అవగాహన..
- మండల వ్యవసాయ అధికారి రాహుల్ రెడ్డి..

**మణుగూరు, మహా :** రాబోయే రబీ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో పండే ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి వి.రాహుల్ రెడ్డి సూచించారు. మణుగూరు మండలంలోని చిన్న రావిగూడెం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధిక నీటి అవసరమయ్యే వరి, మొక్కజొన్న పంటలకు బదులుగా స్వల్పకాలిక పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారి డా.కొమరం లక్ష్మణరావు మాట్లాడుతూ భూసార పరిరక్షణ, నేల సారాన్ని పెంపొందించే పద్ధతులు, అందుబాటులో ఉన్న నీటి వనరుల సమర్థ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ స్థిరమైన వ్యవసాయ పద్ధతులను పాటించాలని కోరారు. కార్యక్రమంలో విద్యుత్ లైన్‌మన్ శంకర్, అసిస్టెంట్ లైన్‌మన్ ముత్యం, రైతులు తెల్లం నరసింహారావు, తెల్లం సత్యం, మడకం చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

## నూతన చట్టాల పై పోలీసులకు అవగాహన తప్పనిసరి

- సాయుధ దళాల సిబ్బందికి శిక్షణా కార్యక్రమంలో ఏసిపి రమణ బాబు

**మడికొండ, మహా :** తెలంగాణ రాష్ట్ర డిజిపి సి.వి. ఆనంద్ సూచన మేరకు, వరంగల్ పోలీస్ కమిషనరేట్ లోని సాయుధ బలగాల సిబ్బందికి నూతన క్రిమినల్ చట్టాల పట్ల అవగాహన కల్పించుటకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐ.పి.ఎస్ కార్యాచరణ చేపట్టారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సాయుధ బలగాల విభాగంలో కానిస్టేబుల్ నుండి కమాండెంట్ వరకు గల మొత్తం 971 సిబ్బందిని 20 బ్యాచ్ లు గా విభజించి, రోజుకు ఒక బ్యాచ్ చొప్పున మడికొండ లోని కమిషనరేట్ పోలీస్ శిక్షణ కేంద్రంలో శిక్షణ ఇచ్చుటకు కు ప్రణాళికా రూపొందించారు. అందులో భాగంగా శనివారం మొదటి బ్యాచ్ కు పోలీస్ శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపల్, ఏసిపి రమణబాబు పర్యవేక్షణలో శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా సిబ్బందికి నూతన చట్టాల పైన అవగాహన తప్పనిసరి అని, ముఖ్యంగా ఎఫ్ఐఆర్ నమోదు, అరెస్టు సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, నేర స్థలంలో సాక్ష్యాధారాల సేకరణ, ధర్నాల నిర్వహణ, ముందస్తు అరెస్టులు, నేరాల విభజన, మహిళలపై జరిగే నేరాలు, టెర్రరిస్టు చట్టాలు, సైబర్ నేరాలు, నేర విచారణలో పోలీసులకు ఉన్న అధికారాలు మొదలగు అంశాల పట్ల శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లా శిక్షకులు ఇన్స్పెక్టర్ సూర్యప్రకాశ్, సహాయక లా శిక్షకులు సబ్ఇన్స్పెక్టర్ లు విజయ్, దేవేందర్, ఆర్ఐ ఉదయ బాస్కర్, ఆర్ ఎస్సై రమేష్ తో పాటు శిక్షణ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



## పిసిసిచీఫ్ ని కలిసిన బొజ్జ రాఘవరెడ్డి...

**కుషాయిగూడ, మహా:** పార్టీ అభ్యున్నతికి సంవత్సరాలుగా కృషి చేస్తున్న సీనియర్లకు తగిన గుర్తింపు లభిస్తుందని పిసిసి చీఫ్ మహేష్ గౌడ్ పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొజ్జ రాఘవ రెడ్డి పిసిసి చీఫ్ మహేష్ గౌడ్ ను కలిశారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి గత 40 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి చేపట్టిన కార్యక్రమాలు కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం తన కృషిని రూపొందించిన ఆల్బమ్ను పిసిసి చీఫ్ కు అందజేశారు. 40 సంవత్సరాలుగా కౌన్సిలర్లను కార్పొరేటర్లను ఎమ్మెల్యేలను ఎంపీలను సైతం గెలిపించడానికి రాఘవరెడ్డి చేసిన కృషిని చూసి అభినందించారు. ఇలాంటి సీనియర్ నాయకులకు తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ఎన్ని విధాలుగా ఇబ్బందులు ఎదురైనప్పటికీ పార్టీని వీడకుండా కాంగ్రెస్ పార్టీ ఉనికిని కోల్పోకుండా కృషి చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొండల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు భద్రత పై అవగాహన కలిగి ఉండాలి

**ట్రాఫిక్ ఏసిపి నాగభూషణం**

**రాజేంద్రనగర్ మహా:** శంషాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్ బి నగర్ లో శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో శనివారం ఎస్ ఐ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ట్రాఫిక్ సిఐ ప్రమోద్ కూమార్, శంషాబాద్ ట్రాఫిక్ ఏసిపి నాగభూషణం హాజరయ్యారు. ట్రాఫిక్ ఏసిపి మాట్లాడుతూ రహదారి భద్రత అనేది ప్రతి ఒక్కరి జీవితానికి సంబంధించిన అత్యంత ముఖ్యమైన అంశం. నిత్యం పెరుగుతున్న వాహనాల సంఖ్య, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల వల్ల రోడ్డు ప్రమాదాలు ఆందోళనకరంగా పెరుగుతున్నాయి. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ఈ ప్రమాదాలను నివారించవచ్చు అన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదు, మద్యం లేదా ఇతర మత్తు పదార్థాల మత్తులో వాహనం నడపడం చట్టరీత్యా నేరం, ఇది ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందన్నారు. అతివేగం ప్రమాదకరం రహదారిపై సూచించిన వేగ పరిమితులను దాటకూడదు. వేగం పెరిగే కొద్దీ ప్రమాద తీవ్రత ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది. డ్రైవింగ్ చేసేటప్పుడు ఫోన్ మాట్లాడటం, మెసేజ్ లు చేయడం వంటివి అస్సలు చేయకూడదు. దీనివల్ల దృష్టి మళ్ళి ప్రమాదాలు జరుగుతాయి. రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను మాత్రమే ఉపయోగించాలి. నడుస్తున్నప్పుడు ఫోన్ చూడటం లేదా ఇయర్‌ఫోన్స్ పెట్టుకోవడం చేయకూడదన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## టీజీపీఎస్సీ పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

- భద్రతా ఏర్పాట్లపై క్షేత్రస్థాయి సమీక్ష.. ప్రశాంతంగా పరీక్షల నిర్వహణకు అధికారులకు సూచనలు

**పెద్దపల్లి మహా :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల, రామగిరిలో ఏర్పాటు చేసిన టీజీపీఎస్సీ పరీక్షా కేంద్రాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సందర్శించి భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో చేపట్టిన భద్రతా చర్యలు, పోలీస్ బందోబస్తు, పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు చేసిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. పరీక్షా కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, పరీక్షల నిర్వహణలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. పరీక్షలు సజావుగా జరిగేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.




# జాఫర్‌ఖాన్‌పేటలో యువకుడిపై ఎనిమిది మంది దాడి!?

- గతంలోనూ తల్లీకొడుకులపై దాడులు జరిగాయని బాధితుల ఆరోపణ
- ఫిర్యాదులపై అధికారులు స్పందించలేదని ఆవేదన..
- రాజకీయ ఒత్తిళ్లు లేకుండా విచారణ జరపాలని విజ్ఞప్తి

**పెద్దపల్లి మహా :** పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం జాఫర్‌ఖాన్‌పేట గ్రామంలో బాకం అన్వేష్ (18) అనే యువకుడిపై అదే గ్రామానికి చెందిన ఎనిమిది మంది యువకుడి కళ్లలో కారం, స్ప్రే చల్లి, కర్రలతో విచక్షణారహితంగా దాడి చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ ఘటనలో అన్వేష్ గాయపడటంతో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

**గతంలోనూ దాడులు జరిగాయని ఆరోపణలు**

బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గతంలోనూ అన్వేష్‌తో పాటు అతని తల్లి బాకం లావణ్య పై దాడి జరిగినట్లు తెలిపారు. ఈ ఘటనలపై అప్పట్లో ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.? గత ఫిర్యాదులపై సకాలంలో స్పందించి ఉంటే ఘటన జరిగేది కాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**ఒంటరి మహిళనని వేధిస్తున్నారని తల్లి ఆరోపణ**

తన భర్త లేని పరిస్థితిని ఆసరాగా చేసుకుని మరిది తనపై ఆధిపత్యం చెలాయిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని అన్వేష్ తల్లి ఆరోపించింది. గతంలోనూ ఇలాంటి ఘటనలు జరిగినప్పటికీ న్యాయం జరగలేదని వాపోయింది. రాజకీయ పలుకుబడితో ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడం లేదని ఆమె, గ్రామస్తులు ఆరోపణలు చేస్తున్నారు. తనకు లొంగకపోవడంతో తన కుమారుడిని లక్ష్యంగా చేసుకుని ఎనిమిది మంది కలిసి దాడి చేశారని, ఇది హత్యాయత్నంగా భావిస్తున్నానని బాధితురాలు పేర్కొంది. అయితే, ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల అధికారిక స్పందన తెలియాల్సి ఉంది.

**పోలీసులు విచారణ జరపాలని విజ్ఞప్తి**

తాజాగా జరిగిన దాడి సమయంలో గ్రామస్తులు అడ్డుకోవడంతోనే తన కుమారుడికి ప్రాణాపాయం తప్పిందని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి, దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా పారదర్శకంగా విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబం విజ్ఞప్తి చేస్తోంది. గతంలో చేసిన ఫిర్యాదులపై అధికారులు తీసుకున్న చర్యలేమిటి? తాజా ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారా? బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోనున్నారు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది

# పట్టభద్రుల భవిష్యత్తు కోసం బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

- బీఆర్ఎస్ పార్టీ మొయినాబాద్ మండల యూత్ ఉపాధ్యక్షులు వడ్ల కాళిదాస్ చారి



**మొయినాబాద్ మహా:** తెలంగాణలో పట్టభద్రుల సమస్యల పరిష్కారం, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు, విద్యార్థుల భవిష్యత్తు సాధన కోసం విద్యావంతులందరూ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా నిలవాలని బీఆర్ఎస్ పార్టీ మొయినాబాద్ మండల యూత్ ఉపాధ్యక్షులు వడ్ల కాళిదాస్ చారి పిలుపునిచ్చారు. రాబోయే ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో డిగ్రీ పూర్తి చేసిన యువతీ యువకులు, విద్యార్థి నాయకులు, ప్రజాస్వామ్య వాదులు బీఆర్ఎస్ అభ్యర్థులకు అండగా ఉండాలని కోరారు. ముఖ్యంగా మహబూబ్నగర్‌రంగారెడ్డిహైదరాబాద్, వరంగల్‌ఖమ్మం నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి విద్యావంతుల గొంతుకకు మరింత బలం చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమంలో యువత చూపిన స్ఫూర్తితోనే నేటి రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికల్లో చైతన్యవంతంగా వ్యవహరించి, తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# సూపర్ ఎల్‌నినోపై అప్రమత్తంగా ఉండాలి..

- నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళికలు అవసరం..
- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓ శ్రీకాంత్

**మణుగూరు, మహా :** సూపర్ ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ముందస్తు ప్రణాళికలతో అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ శ్రీకాంత్ సూచించారు. శనివారం మణుగూరు ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే భూగర్భజలాలు అడుగంటుతున్నాయని, రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. భూగర్భజలాల పెంపునకు ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటి అవసరాలకు వినియోగించిన నీరు వృథా కాకుండా ఇంకుడు గుంతల్లోకి చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు చెరువులు, కుంటల సంరక్షణతో పాటు ఫార్మ్‌పాండ్ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. నీటి వనరుల సంరక్షణలో గ్రామ పంచాయతీలు కీలకపాత్ర పోషించాలని పేర్కొన్నారు. రైతులు వాతావరణ శాఖ సూచనలను అనుసరించి పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని, అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు. ఈ విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తగిన సలహాలు అందించాలన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా నీటి నిల్వలు, పశుగ్రాసం, సాగునీటి నిర్వహణపై ముందుగానే కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు. విత్తనాల అందుబాటు, అత్యవసర సహాయక చర్యలపై సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. వాతావరణ పరిస్థితులపై



# శ్రీ రాగా స్కూల్‌లో ఐక్యరాజ్యసమితి దినోత్సవం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: కొత్తగూడెం పట్టణంలోని మెదరబస్తీలో గల శ్రీ రాగా ప్లే అండ్ హై స్కూల్‌లో శనివారం ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అసెంబ్లీలో కరస్పాండెంట్ మల్లారపు వరప్రసాద్, డైరెక్టర్ కవితతో పాటు పలువురు ఉపాధ్యాయులు ఐక్యరాజ్య సమితి ఆవిర్భావం లక్ష్యాలు ప్రపంచ శాంతి స్థాపనలో దాని పాత్ర అంతర్జాతీయ సహకారం మానవ హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రపంచ దేశాల మధ్య స్నేహభావం ఐకమత్యం పరస్పర గౌరవం శాంతి సహకారం ఎంతో అవసరమని వివరించారు. వివిధ దేశాల మధ్య నెలకొనే సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడంలో ఐక్యరాజ్యసమితి కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విద్యార్థులు ప్రపంచ పౌరులుగా ఎదుగుతూ మానవతా విలువలు సహనం సమానత్వం సోదర భావం వంటి సద్గుణాలను అలవర్చుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో అంతర్జాతీయ అవగాహన ప్రపంచ శాంతి పట్ల బాధ్యత విలువలతో కూడిన విద్య ప్రాముఖ్యతను పెంపొందించేందుకు కృషి చేశారు. పిల్లలకు ఐక్యరాజ్యసమితి గురించి క్విజ్ ఉపన్యాస వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంబాబు, మహా లక్ష్మి, స్వాతి, భారాణి, రమ్య, నాగమణి, చరితశ్రీ, వెంకట లక్ష్మి, హసీనా, అఖిల, రామకృష్ణ, ఆఫ్రీన్, రజినీ ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# సూపర్ ఎల్‌నినోపై అప్రమత్తంగా ఉండాలి..

- నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళికలు అవసరం..
- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓ శ్రీకాంత్



**మణుగూరు, మహా** : సూపర్ ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ముందస్తు ప్రణాళికలతో అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ శ్రీకాంత్ సూచించారు. శనివారం మణుగూరు ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే భూగర్భజలాలు అడుగంటుతున్నాయని, రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. భూగర్భజలాల పెంపునకు ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటి అవసరాలకు వినియోగించిన నీరు వృథా కాకుండా ఇంకుడు గుంతల్లోకి చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు చెరువులు, కుంటల సంరక్షణతో పాటు ఫార్మ్‌పాండ్ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. నీటి వనరుల సంరక్షణలో గ్రామ పంచాయతీలు కీలకపాత్ర పోషించాలని పేర్కొన్నారు. రైతులు వాతావరణ శాఖ సూచనలను అనుసరించి పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని, అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు. ఈ విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తగిన సలహాలు అందించాలన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా నీటి నిల్వలు, పశుగ్రాసం, సాగునీటి నిర్వహణపై ముందుగానే కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు. విత్తనాల అందుబాటు, అత్యవసర సహాయక చర్యలపై సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. వాతావరణ పరిస్థితులపై అధికారిక అంచనాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ గ్రామస్థాయిలో అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, మండలంలోని సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహారాష్ట్రలో కలకలం సృష్టించిన పులి

**ముగ్గురు పశువుల కాపరులు మృతి.**

**చంద్రాపూర్,మహా** : మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలో గత కొన్ని రోజులుగా తీవ్ర భయాందోళనలు సృష్టిస్తూ, ముగ్గురు పశువుల కాపరుల ప్రాణాలు తీసిన పెద్దపులి ఎట్టకేలకు అటవీ శాఖ అధికారులకు చిక్కింది. చంద్రాపూర్ జిల్లా సావళి అటవీ ప్రాంతంలో అధికారులు చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో ఆరేళ్ల వయస్సు గల టి122 పులిని బంధించడంతో స్థానిక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గత నెల రోజులుగా సావళి అటవీ పరిధిలోని ఐదు గ్రామాల్లో ఈ పులి సంచరిస్తూ తీవ్ర భీభత్సం సృష్టించింది. అడవిలోకి పశువులను కాయడానికి వెళ్లిన ముగ్గురు పశువుల కాపరులను ఈ పులి పొట్టనబెట్టుకోవడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇళ్ల నుంచి బయటకు రావడానికి కూడా వణికిపోయే పరిస్థితి ఏర్పడటంతో గ్రామాల్లో ఆందోళనకర వాతావరణం నెలకొంది. ప్రజల ప్రాణాలను కాపాడటం కోసం అటవీ శాఖ అధికారులు ఈ విషయాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకున్నారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 27 నుంచి ఈ పులిని పట్టుకోవడానికి ప్రత్యేకంగా ఒక భారీ ఆపరేషన్‌ను ప్రారంభించారు. రాత్రింబవళ్లు శ్రమించి, అటవీ ప్రాంతంలో నిఘా పెంచిన అధికారులు ఎట్టకేలకు ఆరేళ్ల T122 పులిని బోనులో బంధించడంలో విజయవంతమయ్యారు. పులిని విజయవంతంగా బంధించడంతో సావళి అటవీ పరిధిలోని ఐదు గ్రామాల ప్రజలు, పశువుల కాపరులు ఎట్టకేలకు ఊరట చెందారు.



# మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి..

- జనాభాకు అనుగుణంగా కార్మికులను పెంచాలి..
- సీఐటీయూ జిల్లా నేత సత్రపల్లి సాంబశివరావు

**మణుగూరు, మహా** : మున్సిపాలిటీలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు జనాభాకు అనుగుణంగా కొత్త కార్మికులను నియమించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సత్రపల్లి సాంబశివరావు డిమాండ్ చేశారు. శనివారం మణుగూరులో సీఐటీయూ మండల నాయకత్వం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో సుమారు లక్షన్నర జనాభా ఉండగా కేవలం 30 మంది కార్మికులతో పారిశుధ్య పనులు నిర్వహించాల్సి రావడంతో తీవ్ర పనిభారంతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులపై పనిభారం తగ్గించేందుకు ప్రభుత్వం తక్షణమే అదనపు సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ పొందిన, విధి నిర్వహణలో మరణించిన కార్మికుల స్థానాల్లో వారి కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల క్రమబద్ధీకరణపై ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కొడిశాల రాములు, పల్లపు నాగేశ్వరరావు, నరసింహారావు, దుర్గయ్య, రావులపల్లి వెంకటేశ్వర్లు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.




# భూ రీసర్వే పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్లకు సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ ఆదేశాలు

**పెద్దపల్లి మహా** : భూ రీసర్వే మొదటి దశ పనులను వేగవంతం చేసి, ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామాల్లో సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. భూ రీసర్వే పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పలు సూచనలు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీరాములు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, భూ రీసర్వే మొదటి దశలో ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన 70 రెవెన్యూ గ్రామాల్లో పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సర్వే కోసం సమగ్ర ప్రణాళిక రూపొందించుకొని, అవసరమైన సిబ్బంది, సాంకేతిక వనరులు, యంత్ర పరికరాలను సమకూర్చుకోవాలని తెలిపారు.

**అదనపు బృందాలతో పనుల్లో వేగం పెంచాలి**

సర్వే పనులను త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైన అదనపు బృందాలను ఏర్పాటు చేయాలని కమిషనర్ సూచించారు. అందుబాటులో ఉన్న సిబ్బందిని సమర్ధవంతంగా వినియోగించుకుంటూ, పనుల పురోగతికి అనుగుణంగా బృందాలను కేటాయించాలని ఆదేశించారు. సర్వే సిబ్బందికి అవసరమైన శిక్షణ, సాంకేతిక మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు. గ్రామాల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకొని ప్రతిరోజూ పనుల పురోగతిని సమీక్షించాలని, వెనుకబడిన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

**క్షేత్రస్థాయి సమస్యలకు తక్షణ పరిష్కారం**

భూ రీసర్వే సమయంలో ఎదురయ్యే భూ సరిహద్దుల సమస్యలు, రికార్డుల్లో వ్యత్యాసాలు, సాంకేతిక ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. సంబంధిత రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ, అవసరమైన చోట భూయజమానులకు సర్వే ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా నిబంధనల ప్రకారం పరిష్కరించాలని స్పష్టం చేశారు.

**సాంకేతిక పరికరాలు అందుబాటులో ఉంచాలి**

సర్వేకు అవసరమైన యంత్ర పరికరాలు, సాంకేతిక సదుపాయాలను ముందుగానే సమకూర్చుకోవాలని తెలిపారు. పరికరాల కొరతతో పనుల్లో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సేకరించిన భూ వివరాలను రికార్డులతో సరిపోల్చి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్లు గ్రామాల వారీగా భూ రీసర్వే పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన మార్గదర్శకాలు అందించాలని కమిషనర్ సూచించారు. సంబంధిత అధికారులందరూ సమన్వయంతో పనిచేసి, మొదటి దశ భూ రీసర్వే పనులను నిర్ణీత లక్ష్యాల మేరకు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.



# రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యం అందించాలి

- పీఎం రాహత్ పథకం అమలుపై కలెక్టర్లకు సీఎస్ సంజయ్ జాజు ఆదేశాలు
- రూ.1.50 లక్షల వరకు ఉచిత చికిత్స..
- ఆసుపత్రుల నమోదు తప్పనిసరి

**పెద్దపల్లి మహా** : రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు గోల్డెన్ అవర్‌లో వైద్యం అందించి ప్రాణాలు కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా సమర్థవంతంగా అమలు చేసి, అర్హులైన బాధితులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని సూచించారు. రోడ్డు ప్రమాద బాధితుల చికిత్స పథకం2025 కింద పీఎం రాహత్ పథకం అమలుపై సీఎస్ సంజయ్ జాజు, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి పాల్గొన్నారు. పథకం అమలు, వైద్య సేవలు, ప్రమాద వివరాల నమోదు, క్లెయిమ్‌ల ఆమోదం, నిధుల విడుదలపై అధికారులు ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

**రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్యం**

సీఎస్ మాట్లాడుతూ, పీఎం రాహత్ పథకం కింద అర్హులైన రోడ్డు ప్రమాద బాధితులకు ఒక్కొక్కరికి రూ.1.50 లక్షల వరకు చికిత్స ఖర్చును నిబంధనల ప్రకారం కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను సమీపంలోని ప్రభుత్వ లేదా పథకం పరిధిలోని ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి అత్యవసర వైద్యం అందించాలని స్పష్టం చేశారు. అన్ని సంబంధిత ఆసుపత్రులు పథకంలో తప్పనిసరిగా నమోదు కావాలని, ప్రతి ప్రమాద కేసును ఈడీఏఆర్ పోర్టల్‌లో నమోదు చేసి వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ప్రతి ఆరోగ్యశ్రీ ఆసుపత్రిని సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ వివరాలతో మ్యాపింగ్ చేయాలని సూచించారు. ఆసుపత్రులు, పోలీసు శాఖ, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ చికిత్సలో, క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యం జరగకుండా చూడాలని తెలిపారు. పథకంపై ప్రత్యేక దృష్టి సారించి అర్హులైన బాధితులందరికీ ప్రయోజనాలు అందించాలని ఆదేశించారు.

# ముగిసిన కోటమైసమ్మ జాతర
# 26న హుండీ లెక్కింపు

**జాతరలో సేవలందించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన ఈవో , చైర్మన్**

**కారేపల్లి, మహా** : దసరా పండుగ రోజున ప్రారంభమైన కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి కోటమైసమ్మతల్లి జాతర శనివారంతో ముగిసింది. ఐదు రోజుల పాటి నిరంతరాయం సాగిన జాతరకు ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్ జిల్లాల నుండి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి కోటమైసమ్మ అమ్మవారిని దర్శించుకోవటంతో పాటు జాతరలో సందడిగా గడిపారు. జాతరలో సింగరేణి సీఐ ఎన్ సాగర్, ఎస్సై బైరు గోపీ ఆధ్వర్యంలో పోలీసులు నిరంతర భద్రత పర్యవేక్షణతో ఎలాంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. జాతర కు వచ్చే వాహనాలను నియంత్రించటంలో పోలీసులు సఫలీకృతులైనారు. వైద్య సిబ్బంది సైతం పగలు సమయంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జాతరను కోటమైసమ్మ ఆలయ చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభి రామారావు, ఈవో కే.వెంకటయ్య లు నిరంతరం పర్యవేక్షిస్తూ ఆలయానికి వచ్చే అతిధులను ఆహ్వానిస్తూ అందరి అభిమానాన్ని చూరగొన్నారు. జాతర విజయవంతం కావటంలో కృషి చేసిన పోలీసు, ఇతర ప్రభుత్వశాఖల అధికారులకు ఈవో, ఆలయ చైర్మన్ లు కృతజ్ఞతలు తెలిపారు. జాతర హుండీ లెక్కింపు దేవదాయశాఖా ఉన్నతాధికారుల సమక్షంలో 26వ తేదిన నిర్వహించటం జరుగుతుందని వారుతెలిపారు.



# గోదావరి పుష్కరాలకు ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలి

**పుష్కరాల ప్రత్యేక అధికారి హనుమంతరావు ఆదేశాలు**

**పెద్దపల్లి మహా, మంథని:** 2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని పుష్కరాల ప్రత్యేక అధికారి, దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. శనివారం మంథనిలోని గోదావరి పుష్కర ఘాట్ వద్ద ఏర్పాట్ల పురోగతిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ఆయన పరిశీలించారు. పుష్కరాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఘాట్ల అభివృద్ధి, భద్రత, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, రహదారులు, రాకపోకల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా స్నానఘట్టాలు, రాకపోకల మార్గాలు, ఇతర మౌలిక సదుపాయాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని తెలిపారు. చేపట్టాల్సిన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, అవసరమైన అనుమతులు పొందుతూ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం హనుమంతరావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంథనిలోని గౌతమేశ్వర స్వామి, ఓంకారేశ్వర స్వామి, సురబండేశ్వర స్వామి, మహాలక్ష్మి, లక్ష్మీనారాయణ ఆలయాలను సందర్శించారు. ఆలయాల పరిస్థితి, భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించి, అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, సీఈ దుర్గాప్రసాద్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, ఆర్డీఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ ఆరిఫోద్దీన్, ఈఓ రాజ్‌కుమార్, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యువతకు ఉపయోగపడే కార్యక్రమాలకు ప్రాధాన్యత

**జిల్లా వారసత్వ సంపద పరిరక్షణకు కృషి చేయాలి**

**కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**పెద్దపల్లి మహా** : యువతకు ఉపయోగపడే కార్యక్రమాలను ప్రోత్సహించడంతో పాటు, జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపద పరిరక్షణకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. యువతలో ఆరోగ్యంపై అవగాహన, ఫిట్‌నెస్, చారిత్రక ప్రదేశాల ప్రాముఖ్యతపై చైతన్యం పెంపొందించే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. శనివారం ఐడీఓసీలో అగ్నివీర్, ఎస్ఎస్‌సీ జీడీ అభ్యర్థుల కోసం అక్టోబర్ 31న నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరం, "మన జిల్లా - మన ఖిల్లా" కార్యక్రమంలో భాగంగా నవంబర్ 1న చేపట్టనున్న సీతమ్మలోద్ది ట్రెక్కింగ్‌కు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. అగ్నివీర్, ఎస్ఎస్‌సీ జీడీ అభ్యర్థులకు నిర్వహించే ఉచిత వైద్య శిబిరం ద్వారా వైద్య పరీక్షలకు ముందే ఆరోగ్య సమస్యలను గుర్తించి, అవసరమైన సలహాలు, చికిత్స పొందేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. పెద్దపల్లి బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్ ద్వారా నమోదు చేసుకోవాలని, వివరాలకు 7780543055, 9182691655 నంబర్లను సంప్రదించాలని సూచించారు. నవంబర్ 1న నిర్వహించనున్న సీతమ్మలోద్ది ట్రెక్కింగ్‌లో ఇప్పటికే 250 మంది రన్నర్స్, వాకర్స్ పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని చారిత్రక, ప్రకృతి ప్రదేశాల విశిష్టతను ప్రజలకు పరిచయం చేయడంతో పాటు వారసత్వ సంపద పరిరక్షణపై అవగాహన కల్పించనున్నారు. సుమారు వెయ్యి నుంచి 1,200 సంవత్సరాల నాటి ప్రాచీన చిత్రాలు కలిగిన గుహలు, ఆదిమానవుల జీవన ఆనవాళ్లు ఉన్న సీతమ్మలోద్ది ప్రాంతంతో పాటు పిడుగుతొర్ర, భీమన్న దేవాలయాన్ని సందర్శించేలా కార్యక్రమాన్ని రూపొందించారు. ట్రెక్కింగ్‌లో భాగంగా "YES FOR LIFE - SAY NO TO DRUGS" నినాదంతో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై యువతకు అవగాహన కల్పించనున్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎంఓ ప్రవీణ్ రెడ్డి, మాజీ సైనికుడు, అంతర్జాతీయ పర్వతారోహకుడు లెంకల మహిపాల్ రెడ్డి, ఫొటోగ్రాఫర్లు రవీందర్ రెడ్డి, శీలం అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నికల అఫిడవిట్లలో తప్పుడు సమాచారంపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చు

**ఎన్నికల సంఘం ముందస్తు అనుమతి తప్పనిసరి కాదని స్పష్టీకరణ.**

**సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు!**

న్యూఢిల్లీ, మహా : భారత ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను మరింత పటిష్టం చేసే దిశగా సుప్రీంకోర్టు ఒక కీలక మరియు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. ఎన్నికల నామినేషన్ అఫిడవిట్లలో తప్పుడు సమాచారం లేదా వాస్తవాలను దాచిపెట్టే అభ్యర్థులపై సామాన్య ఓటర్లు ఇకపై నేరుగా ప్రైవేట్ క్రిమినల్ ఫిర్యాదులు దాఖలు చేయవచ్చని స్పష్టం చేసింది. 1951 ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 125ఏ కింద దాఖలు చేసే ఇటువంటి ఫిర్యాదులకు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 195 ప్రకారం పబ్లిక్ సర్వెంట్ లేదా ఎన్నికల సంఘం ముందుస్తు అనుమతి అవసరం లేదని తేల్చిచెప్పింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ శీల్ నాగులతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. ఈ కేసుకు సంబంధించి ప్రధానంగా రెండు చట్టపరమైన నిబంధనలపై కోర్టు విచారణ జరిపింది. నామినేషన్ పత్రాలు లేదా అఫిడవిట్లలో తప్పుడు సమాచారం ఇచ్చే లేదా వాస్తవాలను దాచిపెట్టే అభ్యర్థులకు జరిమానాలు, జైలు శిక్ష విధించడాన్ని ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 125ఏ సూచిస్తుంది. మరోవైపు, నియమించబడిన పబ్లిక్ అథారిటీ లేదా అధికారి రాతపూర్వక ఫిర్యాదు చేస్తే తప్ప, కొన్ని నిర్దిష్ట నేరాలను న్యాయస్థానాలు పరిగణనలోకి తీసుకోకూడదని సీఆర్‌పీసీ సెక్షన్ 195 చెబుతుంది. అయితే సెక్షన్ 125ఏ కింద చేసే నేరానికి సీఆర్‌పీసీ సెక్షన్ 195 నిబంధనలు వర్తించవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సెక్షన్ 125ఏ కింద ప్రాసిక్యూషన్‌ను కేవలం పబ్లిక్ సర్వెంట్లు మాత్రమే ప్రారంభించాలని పార్లమెంటు భావించి ఉంటే, దానికి అనుగుణంగా చట్టాన్ని సవరించి ఉండేదని ధర్మాసనం పేర్కొంది. క్రిమినల్ చర్యలు ప్రారంభించడానికి ఓటర్లు పూర్తిగా ఎన్నికల సంఘంపైనే ఆధారపడాలనే లేదా కేవలం ఎన్నికల పిటిషన్లు మాత్రమే దాఖలు చేయాలనే వాదనను కోర్టు గట్టిగా తోసిపుచ్చింది.

## హాస్టళ్లకు నాసిరకం సరుకులు... నాకాఫ్ సంస్థను రద్దు చేయాలి

- విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షులు బచ్చలి ప్రవీణ్ కుమార్ డిమాండ్



**మంచిర్యాల, మహా ప్రతినిధి** : మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లకు నాసిరకపు సరుకులు సరఫరా చేస్తున్న నాకాఫ్ సంస్థ టెండర్ ను రద్దు చేయాలని విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాకు సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టి, బీసీ, మైనారిటీ, కే జి బి వి గురుకుల హాస్టళ్లకు నాకాఫ్ సంస్థ ద్వారా సరుకులు సరఫరా అవుతున్నాయని తెలిపారు. అయితే ఆ సరుకులు నాణ్యత లేకపోవడం వల్ల విద్యార్థులు, హాస్టల్ వార్డెన్లు, హెచ్ ఎం లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. విద్యార్థులకు అందించాల్సిన 30 రకాల సరుకులకు బదులకు బదులుగా కేవలం 15 రకాల సరుకులు మాత్రమే ఇస్తున్నారని వెల్లడించారు. ఇలా ఇచ్చిన సరుకుల్లో పుచ్చులు, పురుగులు ఉంటున్నాయని, ఇలాంటి సరుకులు వండటం వల్ల విద్యార్థుల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నా పర్యవేక్షణ లోపం వల్ల నాణ్యత లేని సరుకులు వస్తున్నాయని, వెంటనే అధికారులు సమగ్ర విచారణ జరిపి, అవకతవకలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుత టెండర్ రద్దు చేసి కొత్త టెండర్ పిలిచి నాణ్యమైన సరుకులు ఇచ్చే సంస్థకు బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి జన సమితి ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



## గోదావరి పుష్కరాలకు భక్తులకు మెరుగైన సౌకర్యాలు

- దేవాదాయ కమిషనర్ హనుమంతరావు

**మంచిర్యాల, మహా ప్రతినిధి** : 2027 సంవత్సరం గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు వెల్లడించారు. శనివారం జిల్లా కేంద్రంలోని విశ్వనాథ ఆలయాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మేయర్ ధర్ని మధుకర్, ఆర్డీవో శ్రీనివాస్ రావు, దేవాదాయ అధికారి రవి తదితరులతో కలిసి సందర్శించి, ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం కాలేజ్ రోడ్డు గోదావరి తీరంలో పుష్కర ఘాట్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పుష్కరాల కోసం ప్రభుత్వం దాదాపు 2 వేల కోట్లకు పైగా నిధులు మంజూరు చేసిందని తెలిపారు. అందులో పుష్కర ఘాట్లు, మౌలిక వసతులకు సుమారు 1,000 కోట్లు, ప్రధాన దేవాలయాల అభివృద్ధికి మరో 1,000 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ప్రధాన ఆలయాల నిధుల వివరాలు వెల్లడిస్తూ బాసర ఆలయానికి 354 కోట్ల రూపాయలు (ఇందులో 324 కోట్లు ప్రభుత్వ నిధులు, 30 కోట్ల రూపాయలు విరాళాలు), కాళేశ్వరం ఆలయానికి 198 కోట్లు, భద్రాచలం ఆలయానికి 276 కోట్లు, ధర్మపురి ఉగ్ర నరసింహస్వామి ఆలయానికి 10 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. మంచిర్యాల జిల్లాలోని గూడెం గుట్ట ఆలయానికి 58 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఇప్పటికే 40 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను పుష్కరాల నాటికి పూర్తి చేస్తామని, జిల్లా కలెక్టర్లు వారానికోసారి సమీక్షిస్తున్నారని తెలిపారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు.

**జూన్ 26 నుంచి జూలై 7 వరకు పుష్కరాలు**

2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు జరగనున్న పుష్కరాలకు 67 ఘాట్లకు కలిపి 5 నుంచి 6 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని, టెంట్ సిటీలు, పార్కింగ్, తాగునీరు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత కోసం ఏఐ ఆధారిత వ్యవస్థలు, గోదావరి హారతి, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని వివరించారు. అనంతరం చెన్నూర్ లో గోదావరి తీరంలో పుష్కర ఘాట్ పనులను, మదన పోచమ్మ ఆలయాన్ని, చెరువు వద్ద పర్యాటక అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, చైర్మన్ పెద్దింటి పద్మ, ఎంపీడీవో అజ్మత్ అలీ, నీటిపారుదల, దేవాదాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎల్ నినో ఎఫెక్ట్ పై ముందస్తు చర్యలు

- నీటి ఎద్దడి , విద్యుత్ కొరత పై సమీక్ష
- వినియోగదారులకు పలు సూచనలు



**ఆదిలాబాద్ మహా**: ఆదిలాబాద్ పట్టణంలో ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తలెత్తే నీటి ఎద్దడి, విద్యుత్ సమస్యలను ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్ , మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ , మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇంజనీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వాటర్ సర్వీసింగ్ సెంటర్లు, హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు, పెద్ద పాఠశాలలు, కళాశాలలు, రెస్టారెంట్లు, షాపింగ్ మాల్స్, ఇతర వాణిజ్య సంస్థలు పెద్ద మొత్తంలో వినియోగించే నీరు, విద్యుత్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వర్ మాట్లాడుతూ, భవిష్యత్తులో విద్యుత్ కొరతను అధిగమించేందుకు పెద్ద విద్యుత్ వినియోగం కలిగిన సంస్థలు తప్పనిసరిగా సోలార్ విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రత్యామ్నాయ విద్యుత్ ఉత్పత్తి, వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అదేవిధంగా ఆదిలాబాద్ పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో సాధారణంగా ఉండాల్సిన 90 టీఎంసీల నీటి నిల్వకు బదులుగా ప్రస్తుతం కేవలం 36 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని తెలిపారు. ఈ నీటి నిల్వలు ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్ తదితర ప్రాంతాలకు ఫిబ్రవరి, మార్చి వరకు మాత్రమే సరఫరాకు సరిపోవచ్చని పేర్కొంటూ, నీటి వినియోగంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఇంటి యజమాని ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, వర్షపు నీటిని ,ఇంటి నుండి బయటకు వెళ్లే జలాలను ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించాలని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని కోరారు. ముఖ్యంగా అధిక మొత్తంలో నీటిని వినియోగించే వాణిజ్య సంస్థలు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.
నీరు, విద్యుత్ వనరులను వృథా చేసే సంస్థలపై అవసరాన్ని బట్టి భారీ చలానాలు, జరిమానాలు, విధించడంతో పాటు, నిబంధనల ప్రకారం యూనిట్లను సీజ్ చేసే చర్యలు కూడా తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రాబోయే వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, వ్యాపార సంస్థల నిర్వాహకులు, ప్రజలు సమన్వయంతో పని చేయాలని, ఇప్పటికే ఇతర రాష్ట్రాలలో పెద్ద మొత్తంలో చర్యలు తీసుకుంటున్నారు కాబట్టి నీరు మరియు విద్యుత్ పొదుపును సామాజిక బాధ్యతగా భావించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇంజనీర్లు, సంబంధిత శాఖల అధికారులు, పెద్ద మొత్తంలో నీరు, విద్యుత్ వినియోగించే సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నకలీ నంబర్ లారీతో మోసం

- ధాన్యం రవాణాకు బుకింగ్
- సరుకు దారి మళ్లించి అమ్ముకున్న లారీ యజమాని ,డ్రైవర్
- టూ టౌన్ పోలీస్ స్టేషన్ కేసు నమోదు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జీవన్ రెడ్డి




**ఆదిలాబాద్ మహా** : ఆన్‌లైన్ యాప్ ద్వారా లారీ కిరాయికి అందుబాటులో ఉందని నమ్మించి, సరుకు రవాణా పేరుతో మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి తెలిపారు. హర్యానాకు చెందిన లారీ యజమాని రషీద్, తన తోటి డ్రైవర్ షౌకత్ ఖాన్‌తో కలిసి బ్లాక్‌బక్ ఆన్‌లైన్ యాప్ ద్వారా లారీ కిరాయిలు పొందేవారు. అయితే తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో లారీకి తప్పుడు నంబర్ ప్లేట్ ఏర్పాటు చేసి, నకిలీ లారీ పత్రాలను తయారు చేసుకుని వ్యాపారులను మోసం చేయాలని పథకం రచించారు. ఆదిలాబాద్ నుంచి కర్ణాటక రాష్ట్రానికి మొక్కజొన్నల లోడ్ రవాణా చేసేందుకు బుకింగ్ పొందారు. జైనథ్ లో సుమారు 40 వేల 435 కిలోల ధాన్యాన్ని లారీలో లోడ్ చేసుకుని, బుకింగ్ చేసిన వ్యక్తి రోహిత్ షిండే అనే బాధితుడి వద్ద నుంచి ఫోన్‌పే ద్వారా రవాణా ఖర్చుల పేరుతో 50 వేలు కూడా పొందారు. అయితే సరుకును కర్ణాటకలోని నిర్దేశిత ప్రాంతానికి చేర్చకుండా, లారీకి ఉన్న అసలు నంబర్ ప్లేట్ స్థానంలో తప్పుడు నంబర్ ప్లేట్ ఉపయోగించి నాగ్‌పూర్ మీదుగా మధ్యప్రదేశ్ రాష్ట్రానికి తీసుకెళ్లి అక్కడ ప్రశాంత్ అనే వ్యక్తికి మొక్కజొన్నలను విక్రయించి డబ్బులు పొందారు. వచ్చిన డబ్బుల్లో కొంత మొత్తాన్ని లారీ రుణ వాయిదాల చెల్లింపులకు, డ్రైవర్‌కు వాటాగా, వ్యక్తిగత అవసరాలకు వినియోగించినట్లు విచారణలో వెల్లడైంది. ఈ ఘటనపై ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, నిందితులు తమ మొబైల్ ఫోన్లను స్విచ్ ఆఫ్ చేసి పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నారు. సాంకేతిక ఆధారాల సహాయంతో వారి ఆచూకీ గుర్తించిన పోలీసులు మహారాష్ట్రలోని బీడ్ జిల్లా నుంచి ఇద్దరినీ అదుపులోకి తీసుకుని ఆదిలాబాద్‌కు తీసుకొచ్చి విచారించారు. విచారణలో నిందితులు ముందస్తు పథకం ప్రకారం తప్పుడు నంబర్ ప్లేట్ , నకిలీ లారీ పత్రాలను ఉపయోగించి సరుకును దారి మళ్లించి విక్రయించినట్లు వెల్లడించారు. నేరానికి ఉపయోగించిన టాటా కంపెనీకి చెందిన 22 టైర్ల లారీ, నకిలీ లారీ పత్రాలు, మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు .ఈ కేసులో నిందితులు సరుకు రవాణా వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ, వ్యాపారుల నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని మోసానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఇలాంటి మోసాల పట్ల లారీ యజమానులు, వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని, సరుకు రవాణాకు వాహనాలను బుక్ చేసుకునే సమయంలో వాహన రిజిస్ట్రేషన్ వివరాలు, సంబంధిత పత్రాలను సరిచూసుకోవాలని సూచించారు.



## జాతీయ రహదారి 163జీ పనులను వేగవంతం చేయాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం

**వరంగల్, కలెక్టరేట్ మహా** : జాతీయ రహదారి 163జీ కి సంబంధించిన పనుల పురోగతి పై వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం జిల్లా కలెక్టరేట్ లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారికి సంబంధించిన పనుల ప్రస్తుత స్థితి, వివిధ శాఖల సమన్వయం, పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాల పై అధికారులతో చర్చించారు. పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్ష లో జిల్లా ఫారెస్ట్ అధికారి నిఖిత, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్, డియార్వో విజయలక్ష్మి,వరంగల్ నర్సంపేట ఆర్డీవోలు సుమ ఉమారాణిలు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గ్రేటర్ వరంగల్ సిటీ ప్లానర్ గా రవీంద్ర రెడేకర్

**కార్పొరేషన్,మహా** : గతంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఇన్‌చార్జి సిటీ ప్లానర్‌గా విధులు నిర్వహిస్తున్న రవీంద్ర రెడేకర్ జాయింట్ డైరెక్టర్ గా శనివారం పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన అనంతరం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కు పూర్తిస్థాయి సిటీ ప్లానర్ గా పోస్టింగ్ ను ఇచ్చారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ విభాగం లోని అధికారులు సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు.



## ఆదిలాబాద్ సీసీఐ ఇక ఓ జ్ఞాపకమే!

- చరిత్రలో కలిసి పోతున్న సిమెంట్ పరిశ్రమ
- 807 ఎకరాల్లో విస్తరించిన ఫ్యాక్టరీకి ముగింపు దశ
- 1984లో ఉత్పత్తి ప్రారంభం.. 2008లో మూత
- తుక్కు కింద అమ్మకానికి యంత్రసామగ్రి.
- కొనసాగుతున్న కూల్చివేతలు




**ఆదిలాబాద్ మహా** : వేలాది కుటుంబాలకు జీవనాధారంగా నిలిచి, ఆదిలాబాద్ పారిశ్రామిక ప్రగతిలో కీలక పాత్ర పోషించిన సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పరిశ్రమ కనుమరుగయ్యే దశకు చేరింది. 807 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమలో ఒకప్పుడు యంత్రాల శబ్దాలు, కార్మికుల సందడితో కళకళలాడిన ప్రాంగణం నేడు కూల్చివేతలతో వెలవెలబోతోంది. పరిశ్రమలోని పరికరాలు తుక్కు కింద విక్రయమవుతుండగా, నిర్మాణాలు ఒక్కొక్కటిగా నేలమట్టమవుతున్నాయి. పరిశ్రమను తిరిగి ప్రారంభించాలన్న సాధన కమిటీ ప్రయత్నాలు ఫలించకపోవడంతో పునరుద్ధరణపై ఆశలు సన్నగిల్లిపోయాయి. దీంతో ఒకప్పుడు ఆదిలాబాద్‌కు పారిశ్రామిక గుర్తింపునిచ్చిన సీసీఐ ఇక ఓ జ్ఞాపకంగా మిగిలి పోనుంది.

**807 ఎకరాల్లో పరిశ్రమ..**
**వేలాది కుటుంబాలకు ఆధారం**

ఆదిలాబాద్‌లో 807 ఎకరాల విస్తీర్ణంలో 1982లో సీసీఐ పరిశ్రమ ఏర్పాటైంది. 1984లో సిమెంట్ ఉత్పత్తి ప్రారంభమైంది. రోజుకు 1,200 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో కార్యకలాపాలు సాగించిన ఈ పరిశ్రమ ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పించింది. కార్మికులు, ఉద్యోగులతో పాటు రవాణా, వ్యాపార రంగాలకు చెందిన అనేక మంది ఈ పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగించారు. స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చిన సీసీఐ.. అనేక కుటుంబాల జీవితాల్లో భాగమైంది.

**నూతన పారిశ్రామిక విధానంతో కష్టాలు**

కేంద్ర ప్రభుత్వ నూతన పారిశ్రామిక విధానంలో భాగంగా సీసీఐకి అందుతున్న ప్రోత్సాహకాలు ఉపసంహరించడంతో పరిశ్రమకు కష్టాలు మొదలయ్యాయి. 1996 నుంచి కంపెనీ నష్టాలను ఎదుర్కొంటూ వచ్చింది. ఆర్థిక పరిస్థితులు క్రమంగా దిగజారడంతో ఉద్యోగులకు స్వచ్ఛంద పదవీ విరమణ పథకాన్ని ప్రకటించింది. చివరకు 2008లో పరిశ్రమ మూతపడింది. అప్పటి నుంచి ఉత్పత్తి నిలిచిపోయి, భారీ ప్రాంగణం నిరుపయోగంగా మారింది. ఒకప్పుడు వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పించిన పరిశ్రమ దాదాపు రెండు దశాబ్దాలుగా మూతపడే ఉండటంతో స్థానికంగా పారిశ్రామిక కార్యకలాపాలు కూడా తగ్గిపోయాయి.

**ముడిసరుకు పుష్కలం**

సీసీఐ పునరుద్ధరణకు అనుకూలమైన అంశాలు ఉన్నాయనే వాదన స్థానికుల్లో ఉంది. పరిశ్రమకు అవసరమైన ప్రధాన ముడిసరుకు అయిన లైమ్‌స్టోన్ నిల్వలు ఇప్పటికీ పుష్కలంగా ఉన్నాయని చెబుతున్నారు. ముడిసరుకు అందుబాటులో ఉన్నప్పటికీ పరిశ్రమను తిరిగి ప్రారంభించే దిశగా చర్యలు కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. పరిశ్రమ పునరుద్ధరణ జరిగితే స్థానికులకు ఉపాధి అవకాశాలు మళ్లీ అందుబాటులోకి వస్తాయని, ఆదిలాబాద్ పారిశ్రామిక రంగానికి కొత్త ఊపిరి వస్తుందని పలువురు ఆశిస్తున్నారు. అయితే పరిశ్రమ పునరుద్ధరణకు అవసరమైన పెట్టుబడులు, యంత్రాల పరిస్థితి, నిర్వహణ సాధ్యాసాధ్యాలు, ప్రభుత్వ నిర్ణయాలు వంటి అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. పునరుద్ధరణ సాధ్యాసాధ్యాలను పరిశీలించకుండానే పరిశ్రమ ఆనవాళ్లు చెరిగిపోతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

**సాధన కమిటీ పోరాటం.. ఫలించని ప్రయత్నాలు**

మూసివేసిన సీసీఐని తిరిగి ప్రారంభించాలని సాధన కమిటీ కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తోంది. పరిశ్రమను కాపాడితే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ఆదిలాబాద్ పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడుతుందని కమిటీ భావించింది. అయితే ఈ ప్రయత్నాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. పరిశ్రమ పునరుద్ధరణపై స్పష్టమైన నిర్ణయం వెలువడకపోగా, మరోవైపు పరికరాల విక్రయం, కూల్చివేతలు కొనసాగుతుండటం ఆందోళనకు కారణమవుతోంది. ఒకవైపు పరిశ్రమను తిరిగి ప్రారంభించాలన్న డిమాండ్ వినిపిస్తుండగా, మరోవైపు అక్కడి యంత్రసామగ్రి, నిర్మాణాలు కనుమరుగవుతుండటం సీసీఐ భవిష్యత్తును మరింత అనిశ్చితిలోకి నెట్టింది.

**భూములిచ్చిన రైతుల ఆవేదన**

సీసీఐ ఏర్పాటు సమయంలో పరిశ్రమ కోసం భూములిచ్చిన రైతు కుటుంబాలు ఇటీవల తమ భూములను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు భూములు ఇచ్చామని, ప్రస్తుతం పరిశ్రమ మూతపడి కూల్చివేతలు జరుగుతున్న నేపథ్యంలో తమ భూముల విషయంలో న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. పరిశ్రమ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన కుటుంబాలకు, నేడు ఆ పరిశ్రమ ఆనవాళ్లు చెరిగిపోతున్న దృశ్యం ఆవేదన కలిగిస్తోంది. పరిశ్రమను పూర్తిగా తొలగించే పరిస్థితి ఏర్పడితే తమ భూములను తిరిగి అప్పగించాలని రైతు కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పరికరాల విక్రయం, కూల్చివేతలతో సీసీఐ ఆనవాళ్లు చెరిగిపోతుంటే జిల్లా ప్రజల కళ్లు చమర్చుతున్నాయి.









## మంచిర్యాలలో శాంతిభద్రతలపై సమగ్ర విచారణ జరపాలి

- ఐజీకి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్ లేఖ

**మంచిర్యాల, మహా ప్రతినిధి** : మంచిర్యాల నియోజకవర్గంలో నెలకొన్న శాంతిభద్రతల పరిస్థితిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్ తెలంగాణ కాళేశ్వరం జోన్ మల్టీ జోన్ 1 ఐజీకి లేఖ రాశారు. తాను రాసిన లేక సారాంశం ఇలా ఉంది. మంచిర్యాలలో గ్యాంగ్ ఘర్షణలు, బహిరంగ దాడులు, యువతకు మాదకద్రవ్యాల వినియోగం వంటి ఆరోపణలు పెరుగుతున్నాయని, ఇది యువత భవిష్యత్తు, మహిళల భద్రత, సామాన్య ప్రజల ప్రశాంత జీవనానికి ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ఆధిపత్య పోరులో యువతను వాడుకుంటూ ఘర్షణలకు ప్రేరేపిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. పోలీసు శాఖ నిరసనలు, ప్రదర్శనల సమయంలో చూపే శ్రద్ధనే, గ్యాంగ్ ఘర్షణలు, మాదకద్రవ్యాల సరఫరా నిరోధానికి కూడా చూపాలని సూచించారు.

**బీజేపీ తరపున 7 డిమాండ్లు**

మంచిర్యాల పట్టణంలో గ్యాంగ్ ఘర్షణలు, దాడులు, డ్రగ్స్ ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందంతో నిష్పక్షపాత విచారణ, రాజకీయ అనుబంధాలతో సంబంధం లేకుండా నేరాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి, మంచిర్యాలలో పోలీసుల పనితీరుపై సమీక్ష, సమావేశాలు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి, సమర్థులైన, నిజాయితీ గల అధికారుల నియామకం, అవసరమైతే బదిలీలు, డ్రగ్స్ సరఫరా గొలుసుపై ప్రత్యేక నిఘా, యువతలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి, ఫిర్యాదుదారులకు రక్షణ, పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెంపొందించాలి, సమస్యాత్మక ప్రాంతాల్లో పెట్రోలింగ్, నిఘా బలోపేతం వంటి చర్యలు చేపట్టాలని కోరినట్లు లేఖలో వెల్లడించారు. తమకు తమ పార్టీకి మంచిర్యాల ప్రజల భద్రత, స్థానిక వ్యాపారుల రక్షణ, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ అత్యంత ముఖ్యమని వెల్లడించారు. తక్షణమే జోక్యం చేసుకుని మంచిర్యాలను శాంతియుత, సురక్షిత ప్రాంతంగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని లేఖలో ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మంచిర్యాల మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గాజుల ముఖేష్ గౌడ్ ఉన్నారు.

# డీప్ రెడ్ డ్రెస్‌లో తమన్నా భాటియా..



టాలీవుడ్, బాలీవుడ్ ప్రేక్షకులకు సుపరిచితమైన మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా మరోసారి తన ఫ్యాషన్ ఎంపికలతో ఆకట్టుకుంటున్నారు. సినిమాలతో పాటు ప్రత్యేక కార్యక్రమాలు, ఫొటోషూట్లలోనూ తనదైన శైలిని ప్రదర్శించే ఈ అందాల భామ తాజాగా డీప్ రెడ్ హాల్టర్ డ్రెస్‌లో మెరిశారు. ఈ డ్రెస్‌కు జతగా బంగారు ఆభరణాలను ధరించి గ్లామరస్ లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షించారు. ఎరుపు రంగు దుస్తులకు ఉండే ప్రత్యేకమైన ఆకర్షణకు, బంగారు ఆభరణాల మెరుపు తోడవడంతో ఆమె రూపం మరింత ప్రత్యేకంగా కనిపిస్తోంది. శరీరాకృతికి అనుగుణంగా రూపొందించిన డ్రెస్, హాల్టర్ నెక్ డిజైన్ ఈ లుక్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. మెడలో లేయర్డ్ గోల్డ్ చైన్స్, ఆకర్షణీయమైన పెండెంట్‌తో పాటు చేతులకు బంగారు గాజులు, ఉంగరాలను ధరించి స్టైలిష్‌గా కనిపించారు. వదులుగా వదిలిన జుట్టు, సహజమైన మేకప్, న్యూడ్ టోన్ లిప్‌స్టిక్‌తో తన అలంకరణను అందంగా పూర్తి చేశారు. దుస్తులు, ఆభరణాల మధ్య చక్కని సమన్వయం ఉండేలా చూసుకోవడం తమన్నా ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. సాధారణంగా ఫ్యాషన్ విషయంలో కొత్త ప్రయోగాలు చేయడానికి ఇష్టపడే ఆమె, సంప్రదాయ ఆభరణాలను ఆధునిక దుస్తులతో జతచేస్తూ ప్రత్యేకమైన స్టైల్‌ను పరిచయం చేస్తున్నారు. ముఖ్యంగా ఎరుపు రంగు దుస్తులకు గోల్డ్ జ్యువెలరీని జతచేయడం ద్వారా పార్టీలు, ప్రత్యేక వేడుకలకు అనువైన ఫ్యాషన్ లుక్‌ను అందించారు. తమన్నా కేవలం నటిగానే కాకుండా ఫ్యాషన్, ఆభరణాల రంగాల్లోనూ తన అభిరుచిని చాటుకుంటున్నారు. ఆమెకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటుండగా, ఈ కొత్త లుక్‌పై ఫ్యాషన్ ప్రియులు ఆసక్తి చూపిస్తున్నారు. మరోవైపు సినిమాలు, ఓటీటీ ప్రాజెక్టులతో బిజీగా ఉంటూనే తన వ్యక్తిగత స్టైల్‌తోనూ వార్తల్లో నిలుస్తున్నారు. ఎప్పటికప్పుడు భిన్నమైన దుస్తులు, ఆభరణాలను ఎంచుకుంటూ తన ఫ్యాషన్ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు తమన్నా.

# షారుఖ్ ఖాన్ 'కింగ్' ఎంట్రీ సీన్ అదిరిపోతుందట..

## టీజర్‌పై భారీ అంచనాలు!



బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ మరోసారి వెండితెరపై తనదైన మాస్ ఇమేజ్‌తో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన ప్రధాన పాత్రలో దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ చిత్రం 'కింగ్'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'పఠాన్', 'జవాన్' సినిమాలతో బాక్సాఫీస్ వద్ద ఘన విజయాలు అందుకున్న షారుఖ్.. ఈసారి మరింత భిన్నమైన పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో ఆయన ఎంట్రీ సీన్‌కు సంబంధించిన వార్తలు సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ఇప్పటివరకు భారతీయ తెరపై చూడని విధంగా షారుఖ్ పరిచయ సన్నివేశాన్ని దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ రూపొందించినట్లు సమాచారం. తెరపై బాద్‌షా కనిపించగానే అభిమానులు విజిల్స్ వేసేలా, ఆయన వ్యక్తిత్వం, స్టైల్, ప్రమాదకరమైన రూపాన్ని ప్రతిబింబించేలా ఈ సన్నివేశాన్ని తీర్చిదిద్దినట్లు టాక్ వినిపిస్తోంది. సాధారణ యాక్షన్ సన్నివేశాలకు భిన్నంగా ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచేలా ఈ ఎంట్రీ ఉంటుందని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వివరాలపై చిత్రబృందం అధికారికంగా స్పందించాల్సి ఉంది. మరోవైపు 'కింగ్' టీజర్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. షారుఖ్ ఖాన్ పుట్టినరోజైన నవంబర్ 2న టీజర్‌ను విడుదల చేసే అవకాశం ఉందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే విడుదల తేదీపై అధికారిక ప్రకటన వచ్చే వరకు దీనిని ధ్రువీకరించిన వార్తగా భావించలేం. ఈ చిత్రంలో షారుఖ్ కుమార్తె సుహానా ఖాన్‌తో పాటు దీపికా పదుకొణె, అభిషేక్ బచ్చన్, అనిల్ కపూర్, జైదీప్ అహ్లావత్, అర్షద్ వార్సీ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు సమాచారం. రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్, మార్‌ఫ్లిక్స్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నారు. యాక్షన్, స్టైలిష్ విజువల్స్, భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న 'కింగ్' డిసెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. షారుఖ్ మరోసారి బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనం సృష్టిస్తారోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఏంటి డార్లింగ్ ఇది.. 'స్పిరిట్', 'ఫౌజీ'లో ఒకే తరహా లుక్.. ప్రభాస్‌పై చర్చ!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ సినిమాలంటే అభిమానుల్లో అంచనాలు ఏ స్థాయిలో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆయన నుంచి చిన్న పోస్టర్ విడుదలైనా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతుంది. ప్రస్తుతం ప్రభాస్ నటిస్తున్న 'స్పిరిట్', 'ఫౌజీ' చిత్రాలకు సంబంధించిన లుక్స్ కూడా అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. అయితే ఈ రెండు సినిమాల్లో ఆయన కనిపించిన తీరు ఇప్పుడు మరో ఆసక్తికర చర్చకు దారితీసింది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'స్పిరిట్' చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్‌లో ప్రభాస్ నోట్లో సిగరెట్‌తో కనిపించారు. హీరోయిన్ తృప్తి డిమ్రి ఆయన సిగరెట్‌ను వెలిగిస్తున్నట్లు ఆ పోస్టర్‌లో చూపించారు. తాజాగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఫౌజీ' టీజర్‌లోనూ ప్రభాస్ చేతిలో భారీ తుపాకీ, నోట్లో సిగరెట్‌తో కనిపించడం ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. రెండు సినిమాలకు సంబంధించిన ఈ దృశ్యాల్లో పోలికలు కనిపించడంతో సోషల్ మీడియాలో నెటిజన్లు చర్చించుకుంటున్నారు. ప్రభాస్‌ను మాస్ లుక్‌లో చూపించడానికి దర్శకులు సిగరెట్‌నే ప్రధాన ఆకర్షణగా ఉపయోగిస్తున్నారా? అనే ప్రశ్నలు కూడా వ్యక్తమవుతున్నాయి. కొందరు అభిమానులు ఈ లుక్‌ను ఆస్వాదిస్తుండగా, మరికొందరు మాత్రం రెండు సినిమాల్లోనూ ఇలాంటి పోలికలు కనిపించడం ఆశ్చర్యంగా ఉందని అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా కోట్లాది మంది అభిమానులను కలిగి ఉన్న స్టార్ హీరోల తెరపై కనిపించే అలవాట్లు యువతపై ప్రభావం చూపే అవకాశం ఉందని కొందరు పేర్కొంటున్నారు. హీరో పాత్రలోని తీవ్రతను, ధైర్యాన్ని, వ్యక్తిత్వాన్ని చూపించడానికి సిగరెట్ వంటి అంశాలపై ఆధారపడకుండా నటన, సంభాషణలు, కథలోని బలమైన సన్నివేశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తున్నారు. అయితే ఈ రెండు సినిమాల కథలు, పాత్రల నేపథ్యాలు వేర్వేరు కావడంతో ఆయా పాత్రలకు అనుగుణంగానే దర్శకులు ఈ లుక్‌లను రూపొందించి ఉండవచ్చనే అభిప్రాయాలు కూడా ఉన్నాయి. 'స్పిరిట్'లో ప్రభాస్ శక్తివంతమైన పోలీసు అధికారిగా కనిపించనుండగా, 'ఫౌజీ'లో రెండో ప్రపంచ యుద్ధం నేపథ్యంలో సాగే కథలో భారతీయ సైనికుడు, గూఢచారి తరహా పాత్రలో కనిపించనున్నారు. ఈ రెండు సినిమాలపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఒకవైపు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ ఎలా కనిపిస్తారనే ఆసక్తి ఉండగా, మరోవైపు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామాపై కూడా అభిమానులు ఆశలు పెట్టుకున్నారు. మొత్తానికి రెండు చిత్రాల్లోనూ సిగరెట్‌తో కనిపించిన ప్రభాస్ లుక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు కారణమయ్యాయి. ఈ పోలికలపై చిత్రబృందాలు ఎలా స్పందిస్తాయో చూడాలి.



# మెగా అభిమానులకు గుడ్‌న్యూస్!

గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కలయికలో తెరకెక్కనున్న భారీ చిత్రం 'ఆర్సీ 17'కు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చింది. 'రంగస్థలం' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత వీరిద్దరూ మరోసారి కలిసి పనిచేయనుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా ప్రకటన వచ్చినప్పటి నుంచి ఎప్పుడు ప్రారంభమవుతుంది? రెగ్యులర్ షూటింగ్ ఎప్పటి నుంచి మొదలవుతుంది? అనే ప్రశ్నలు అభిమానులను ఆసక్తికి గురిచేస్తున్నాయి. తాజాగా ఈ సినిమా ప్రారంభోత్సవ తేదీపై నిర్మాత మైత్రీ మూవీ మేకర్స్‌కు చెందిన వై. రవిశంకర్ స్పష్టత ఇచ్చారు. నవంబర్ 1న 'ఆర్సీ 17' పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వాస్తవానికి దసరా పండుగ రోజునే సినిమాను ప్రారంభించాలని చిత్రబృందం భావించింది. అయితే మంచి ముహూర్తం కుదరకపోవడంతో కార్యక్రమాన్ని వాయిదా వేయాల్సి వచ్చింది. తొలుత అక్టోబర్ 26 లేదా 27 తేదీల్లో ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు ప్రచారం జరిగినప్పటికీ, తాజాగా నవంబర్ 1 తేదీని ఖరారు చేసినట్లు నిర్మాత తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం సినిమా నిర్మాణానికి సంబంధించిన తదుపరి పనులను వేగవంతం చేయనున్నట్లు సమాచారం. రామ్‌చరణ్ ప్రస్తుతం ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉండగా, సుకుమార్ ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులపై దృష్టి సారిస్తున్నారు. కథ, పాత్రల రూపకల్పన, సాంకేతిక బృందం ఎంపిక వంటి అంశాలపై చిత్రబృందం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ సినిమాకు సంగీత దర్శకుడిగా ఎవరు పనిచేస్తారనే అంశంపై కూడా ఆసక్తికర చర్చ జరుగుతోంది. గతంలో సుకుమార్ సినిమాలకు అద్భుతమైన సంగీతం అందించిన దేవిశ్రీ ప్రసాద్ కొనసాగుతారా? లేక మరో సంగీత దర్శకుడికి అవకాశం దక్కుతుందా? అనే ప్రశ్నలకు ఇంకా పూర్తిస్థాయి సమాధానం రాలేదు. ఈ విషయంలో తుది నిర్ణయం దర్శకుడు సుకుమార్‌దేనని నిర్మాత ఇప్పటికే స్పష్టం చేశారు. హీరోయిన్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం 'రంగస్థలం' విజయాన్ని మించి ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే ఆశాభావం అభిమానుల్లో కనిపిస్తోంది. నవంబర్ 1న ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో రామ్‌చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో రాబోయే ఈ సినిమా ఎలాంటి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తుందోనని సినీప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# గ్యాంగ్‌స్టర్లకు ఆర్జీవీ ఆత్మబంధువు..

## అందుకే ఆయనపై దాడులు చేయలేదా?

విలక్షణమైన సినిమాలతో భారతీయ చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. క్రైమ్, గ్యాంగ్‌స్టర్ కథలను తెరపై సహజంగా ఆవిష్కరించడంలో ఆయనది ప్రత్యేకమైన శైలి. ముఖ్యంగా ముంబై అండర్‌వరల్డ్ నేపథ్యంలో తెరకెక్కించిన 'సత్య', 'కంపెనీ' వంటి సినిమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడమే కాకుండా, గ్యాంగ్‌స్టర్ చిత్రాల రూపురేఖలను మార్చేశాయి. అయితే ముంబై అండర్‌వరల్డ్ ప్రభావం బాలీవుడ్‌పై బలంగా ఉన్న సమయంలో పలువురు సినీ ప్రముఖులు బెదిరింపులు ఎదుర్కొన్నప్పటికీ, ఆర్జీవీ మాత్రం తన సినిమాల కారణంగా అలాంటి బెదిరింపులను ఎదుర్కోలేదని గతంలో వెల్లడించారు. దీనికి కారణం గ్యాంగ్‌స్టర్లను ఆయన సినిమాల్లో చూపించిన విధానమేనని చర్చ జరుగుతోంది. సాధారణంగా నేరగాళ్లను కేవలం ప్రతినాయకులుగా చూపించకుండా, వారి జీవితాలు, ఆలోచనలు, వ్యక్తిగత సంఘర్షణలను కూడా వర్మ తన కథల్లో ఆవిష్కరించారు. నేర ప్రపంచంలోకి వారు ఎలా వచ్చారు? వారి జీవితాల్లో ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి? అనే అంశాలను కథల్లో భాగం చేశారు. దీంతో ఆయన సినిమాల్లోని పాత్రలు ప్రేక్షకులకు సహజంగా అనిపించేవి. 'సత్య'లో భీకూ మాత్రే పాత్ర, 'కంపెనీ'లోని గ్యాంగ్‌స్టర్ పాత్రలు ఈ శైలికి ఉదాహరణలుగా నిలిచాయి. అండర్‌వరల్డ్ గురించి లోతుగా తెలుసుకోవడానికి వర్మ నిజ జీవిత వ్యక్తులు, పోలీసు అధికారులు, సంబంధిత వ్యక్తులతో మాట్లాడి సమాచారం సేకరించేవారు. ఈ పరిశోధన ఆయన సినిమాలకు వాస్తవికతను తీసుకొచ్చింది. గతంలో పలు ఇంటర్వ్యూల్లో అండర్‌వరల్డ్ వ్యక్తులు తన సినిమాలను ఇష్టపడేవారని, వారి ప్రపంచాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేశానని ఆయన చెప్పిన సందర్భాలున్నాయి. గ్యాంగ్‌స్టర్లకు తాను ఆత్మబంధువు లాంటి వాడిననే భావనను కూడా ఆయన వ్యక్తం చేసినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఆయనపై దాడులు జరగకపోవడానికి ఇదొక్కటే కారణమని నిర్ధారించలేం. అండర్‌వరల్డ్ నేపథ్యాన్ని నిజాయితీగా తెరపై చూపించాలనే ఆసక్తి, విస్తృత పరిశోధన, విభిన్నమైన కథన శైలి వర్మకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. ముంబై నేర ప్రపంచంలోని చీకటి కోణాలను సినిమాల ద్వారా ప్రేక్షకులకు పరిచయం చేసిన దర్శకుల్లో ఆర్జీవీ ఒకరిగా నిలిచారు. ఇప్పటికీ గ్యాంగ్‌స్టర్ సినిమాల గురించి చర్చ వచ్చినప్పుడు 'సత్య', 'కంపెనీ' చిత్రాలు గుర్తుకొస్తుండటం ఆయన దర్శకత్వ ప్రతిభకు నిదర్శనం.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.11562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com